ప్రభాత
# కిరణమ్
సత్యానికి వారధి

PRGI REGD No.: TGTEL/26/A4986

పక్కా తెలుగు

5 DOTS NETWORK

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 036 | గురువారం | 30-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/-    www.prabhathakiranam.com

Medchal Malkajigiri | Volume : 01 | Issue : 036 | Thursday | 30-07-2026 | Pages: 08 | Price : Rs.4/-    Circulated to Telangana | Published from Medchal Malkajgiri

## ఓటరు జాబితాకు.. సంక్షేమ పథకాలకు లింక్ లేదు

- ఆగస్టు 3లోగా సర్ పూర్తి చేయాల్సిందే
- తేల్చి చెప్పిన సీఈఓ సుదర్శన్ రెడ్డి

2లో..






3లో..

## నిరుద్యోగులకు గుడ్ న్యూస్

7,437 పోలీసు ఉద్యోగాలు • ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీ

త్వరలో దరఖాస్తుల ప్రారంభం • నిరుద్యోగ యువతకు బిగ్ రిలీఫ్

## బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు!

- బాబ్రీపై అభిప్రాయం దేశద్రోహం కాదు
- భిన్నాభిప్రాయం నేరం కానేరదు
- ప్రాథమిక హక్కులకు రక్షణకే తీర్పు



3లో..



## ఆలస్యంగా జనన-మరణ నమోదు

- ఇక కష్టం.. కేంద్రం కొత్త బిల్లు!
- రెండేళ్లు దాటితే కఠిన నిబంధనలు
- లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టిన కేంద్రం

3లో..



# కర్షకులకు కరెంటు కష్టాలొస్తే ఖబడ్దార్

అధికారులకు రాజన్న స్వీట్ వార్నింగ్

### ఎల్ నినో ఎఫెక్ట్..

వర్షాలు తగ్గొచ్చు.. బోరుబావులే రైతుల ఆశ

సమర్థవంతంగా పనిచేసే అవకాశం కల్పిస్తా

బాధ్యతతో పనిచేయండి.. లేదంటే వెళ్లిపోండి

విద్యుత్ శాఖ అధికారులకు రాజన్న అల్టిమేటం!

ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితుల్లో వ్యవసాయం పూర్తిగా బోరుబావులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. మునుగోడు క్యాంపు కార్యాలయంలో యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాల విద్యుత్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పరిస్థితిని సమీక్షించారు. రైతులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే కార్యాచరణ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. (వివరాలు 2లో..)

7లో..



- స్టార్ హీరోలకు వరుసగా ఏమైంది?
- నలుగురు స్టార్ హీరోలకు ఆపరేషన్లు
  అభిమానుల్లో టెన్షన్..
- కోలుకోవాలని ప్రార్థనలు
- ఏమైంది టాలీవుడ్‌కు..? స్టార్ హీరోలందరికీ వరుస గాయాలు!

## టాలీవుడ్‌ను వెంటాడుతున్న సర్జరీలు

# అమిత్ షాను తొలగించాల్సిందే!

## రాహుల్ వ్యాఖ్యలతో దద్దరిల్లిన సభ




వివరాలు3లో..

- క్షమాపణకు సర్కార్ డిమాండ్
- చెప్పేదే లేదన్న కాంగ్రెస్ అగ్రనేత

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు బుధవారం తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి. కాక్‌రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల నిరసనల సందర్భంగా పోలీసుల కాల్పులకు కేంద్ర హోంమంత్రి అమిత్ షానే ఆదేశాలు ఇచ్చారని రాహుల్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలతో అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు లేచి, ఎలాంటి ఆధారాలు లేకుండా చేసిన ఈ ఆరోపణలకు రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

### స్పీకర్ వద్ద చర్చలు

సభలో గందరగోళం పెరగడంతో సమావేశాన్ని మధ్యాహ్నం వాయిదా వేశారు. అనంతరం కిరణ్ రిజిజు పార్లమెంట్ భవనంలో అమిత్ షాతో సమావేశమై పరిస్థితిని వివరించారు. తర్వాత స్పీకర్ ఓం బిర్లాను కలిసి అధికారికంగా అభ్యంతరం తెలిపారు. అదే సమయంలో కాంగ్రెస్ నేతలు ప్రియాంక గాంధీ, కే.సి. వేణుగోపాల్, గౌరవ్ గొగోయ్ కూడా స్పీకర్‌ను కలిసి చర్చించారు. స్పీకర్ సమక్షంలో ఇరు పక్షాల మధ్య చర్చలు జరిగినట్లు సమాచారం.

## దాడులు చేయడం దుర్మార్గం

లోక్ సభ సాక్షిగా రాహుల్ దూకుడు

అమిత్ షా లక్ష్యంగా విమర్శల దాడి


విద్యార్థుల నిరసనలే దేశ భవిష్యత్!

ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ ఆరోపణలు

నీట్ పేపర్ లీక్ నిరసనల సందర్భంగా విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలను ప్రస్తావిస్తూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర విమర్శలు చేశారు. హోంమంత్రి సభలో లేకపోవడం భయంతోనేనని వ్యాఖ్యానించారు. పలు నగరాల్లో విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలకు అమిత్ షానే బాధ్యత వహించాలని ఆరోపించారు. అయితే ఈ వ్యాఖ్యలను సభా రికార్డుల నుంచి తొలగించారు. ఈ అంశంపై చర్చ జరగడం లేదని స్పీకర్ ఓం బిర్లా సూచిస్తూ, ఆరోపణలకు ఆధారాలు చూపాలని కోరారు.








## పేపర్ లీక్‌లపై కేంద్రం ఉక్కుపాదం

- కొత్త చట్టంతో కఠిన చర్యలు!
- 10 ఏళ్ల జైలు, ₹ 50 లక్షల జరిమానా
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టులతో వేగంగా విచారణ

దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల్లో పేపర్ లీక్‌లకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026ను తీసుకొచ్చింది. ఇటీవల జరిగిన విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ఈ బిల్లుకు రూపకల్పన జరిగింది. పరీక్షల విశ్వసనీయతను కాపాడటం, అక్రమాలకు పాల్పడే వ్యక్తులు, ముఠాలు, సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యంగా కేంద్రం పేర్కొంది. (వివరాలు 3లో..)



## నిజం దాచేందుకు ఎత్తుగడలు!

ట్రైనీ ఐపీఎస్ రిమాండ్

వేధింపుల కేసులో బిగిస్తున్న ఉచ్చు

చంచల్‌గూడ జైలుకు తరలింపు

చట్టాన్ని కాపాడాల్సిన ఓ ట్రైనీ ఐపీఎస్ అధికారిపైనే తీవ్రమైన నేరారోపణలు రావడం సంచలనం సృష్టించింది. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఫిర్యాదుతో నమోదైన కేసులో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిర్యాలగూడలో అరెస్టు చేసిన అనంతరం ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు అప్పగించారు. బుధవారం ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరచగా, కోర్టు ఆగస్టు 11 వరకు 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం పోలీసులు ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. (వివరాలు 2లో..)

## తరం తరం నరం నరం వందే మాతరం

అవమానిస్తే జైలు శిక్ష!

రాజ్యసభలో బిల్లుకు ఆమోదం

దేశభక్తికి ప్రతీకగా భావించే 'వందే మాతరం' ను అవమానించడం శిక్షార్హ నేరంగా ప్రకటించే జాతీయ గౌరవ పరిరక్షణ (సవరణ) బిల్లు-2026కు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. వాయిస్ ఓట్ ద్వారా బిల్లును ఆమోదించారు. ఈ బిల్లుతో వందే మాతరానికి జాతీయ గీతం 'జనగణమన'కు ఉన్నట్టే చట్టపరమైన రక్షణ కల్పించనున్నారు. దేశవ్యాప్తంగా వందే మాతరం 150వ వార్షికోత్సవ వేడుకలు జరుగుతున్న సమయంలో ఈ బిల్లుకు ఆమోదం లభించడం ప్రాధాన్యం సంతరించుకుంది. (వివరాలు 3లో..)






## కాళేశ్వరం నుంచి చుక్క నీరు వాడలేదు

కానీ అత్యధిక ధాన్యం పండించాం

ఎన్‌డీఎస్‌ఏ సూచనలతోనే ముందుకు

కేటీఆర్ వ్యాఖ్యలు సిగ్గుచేటన్న మంత్రి ఉత్తమ్

కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు సిగ్గుచేటని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. నాణ్యత లోపాలతోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని ఆరోపించారు. నిర్మాణం జరిగిన కాలంలోనే బ్యారేజీల్లో సమస్యలు బయటపడటం అప్పటి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ప్రాజెక్టును సమర్థించుకోవడం సరైంది కాదని ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. (వివరాలు 2లో..)

## కీలక ప్రాజెక్టులకు సుప్రీం అభయం

- పర్యావరణ అనుమతులపై క్లారిటీ
- మంజూరైనవి చెల్లుబాటులోనే

తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఊరట కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను (ఓఎం) రద్దు చేసినప్పటికీ, ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులు పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఇచ్చిన ఈ తీర్పుతో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు ఎలాంటి చట్టపరమైన అడ్డంకులు ఉండవని స్పష్టత వచ్చింది. (వివరాలు 2లో..)





## వాయుగుండం ఎఫెక్ట్

ముంచెత్తుతున్న వర్షాలు!

ఉత్తర తెలంగాణలో జోరు

పలు జిల్లాలకు అలర్ట్

తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో వాగులు, వంకలు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో పంటలు నీటమునిగాయి. వరద ఉద్ధృతితో కొన్ని రహదారులు దెబ్బతినడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాల తీవ్రత మరింత ఎక్కువగా కనిపిస్తోంది. (వివరాలు 2లో..)

# కాళేశ్వరం నుంచి చుక్క నీరు వాడలేదు

- కానీ అత్యధిక ధాన్యం పండించాం
- ఎన్‌డీఎస్‌ఏ సూచనలతోనే ముందుకు
- కేటీఆర్ వ్యాఖ్యలు సిగ్గుచేటన్న మంత్రి ఉత్తమ్

కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు సిగ్గుచేటని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. నాణ్యత లోపాలతోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని ఆరోపించారు. నిర్మాణం జరిగిన కాలంలోనే బ్యారేజీల్లో సమస్యలు బయటపడటం అప్పటి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ప్రాజెక్టును సమర్థించుకోవడం సరైంది కాదని ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు.

### నాసిరకం డిజైన్‌పైనే ఆరోపణలు

కాళేశ్వరం బ్యారేజీల్లో తలెత్తిన సమస్యలకు ప్రధాన కారణం నాసిరకం డిజైన్, నాసిరకం నిర్మాణమేనని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. బ్యారేజీలో 2 నుంచి 3 టీఎంసీల నీరు నిల్వ చేయాల్సిన చోట 10 టీఎంసీల వరకు ఎందుకు నిల్వ చేశారో చెప్పాలని ప్రశ్నించారు. అప్పట్లో ప్రాజెక్టు నాణ్యతపై సరైన శ్రద్ధ తీసుకుని ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి వచ్చేది కాదని విమర్శించారు.

### ఎన్‌డీఎస్‌ఏ నివేదిక మేరకే చర్యలు

కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల విషయంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక ప్రకారమే ప్రభుత్వం ముందుకు వెళ్తోందని మంత్రి స్పష్టం చేశారు. అంతర్జాతీయ నిపుణులు, ఎన్‌డీఎస్‌ఏ అధికారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగుతున్నాయని తెలిపారు. మూడు బ్యారేజీలపై సాంకేతిక పరీక్షలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఐఐటీ బాంబే, ఆఫ్రో ఇండియా నిపుణులతో కలిసి పునరుద్ధరణ డిజైన్లను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. రైతులకు సాగునీరు అందించేందుకు వీలైనంత త్వరగా మరమ్మతులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

### జూలై 31న కీలక సమావేశం

కాళేశ్వరం అంశంపై ఈ నెల 31న నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కీలక సమావేశం నిర్వహించనున్నట్లు ఉత్తమ్ తెలిపారు. సెంట్రల్ వాటర్ కమిషన్, తెలంగాణ ప్రభుత్వ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం జరగనుందని చెప్పారు. భవిష్యత్ కార్యాచరణ, మరమ్మతుల విధానంపై ఈ సమావేశంలో నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు. ఎన్‌డీఎస్‌ఏ లిఖితపూర్వకంగా ఇచ్చే సూచనల ప్రకారమే ప్రభుత్వం చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. కాఫర్ డ్యామ్ నిర్మాణం అవసరమా కాదా అన్న అంశంపైనా నిపుణుల సలహాల ఆధారంగానే నిర్ణయం



తీసుకుంటామని తెలిపారు.

### హైడ్రాపై స్పందన

హైడ్రా అంశంపై కూడా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. హైడ్రా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిధిలోని శాఖ అని చెప్పారు. ఆ అంశంపై నిర్ణయం తీసుకునే అధికారం పూర్తిగా ముఖ్యమంత్రికే ఉందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి స్పందించిన తర్వాత తాను మాట్లాడటం సముచితం కాదని పేర్కొన్నారు. మున్సిపల్ శాఖ కూడా ముఖ్యమంత్రి పరిధిలోనే ఉందని, సంబంధిత నిర్ణయాలు ఆయనే తీసుకుంటారని వెల్లడించారు. ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా సాంకేతిక నిపుణుల సూచనల ఆధారంగా కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ చేపడుతోందని, రైతుల ప్రయోజనాలే తమకు అత్యంత ప్రాధాన్యమని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# కర్షకులకు కరెంటు కష్టాలొస్తే ఖబడ్దార్

## అధికారులకు రాజన్న స్వీట్ వార్నింగ్

- వర్షాలు తగ్గొచ్చు.. బోరుబావులే రైతుల ఆశ
- సమర్థవంతంగా పనిచేసే అవకాశం కల్పిస్తా
- బాధ్యతతో పనిచేయండి.. లేదంటే వెళ్లిపోండి
- విద్యుత్ శాఖ అధికారులకు రాజన్న అల్టిమేటం!



### కరెంటుకే తొలి ప్రాధాన్యం

ప్రస్తుత కాలంలో విద్యుత్ ప్రజల జీవనంలో విడదీయరాని భాగమైందని కోమటిరెడ్డి అన్నారు. కరెంటుకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. మునుగోడు నియోజకవర్గాన్ని విద్యుత్ రంగంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. ముందుగా మండల కేంద్రాల్లో విద్యుత్ సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని, తర్వాత గ్రామాల్లో సమస్యలను దశలవారీగా తొలగించాలని ఆదేశించారు. వ్యవసాయ బోరుబావుల విద్యుత్ లైన్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గృహాలపై వెళ్లే విద్యుత్ తీగలను తొలగించి భద్రతతో కూడిన వ్యవస్థ ఏర్పాటు చేయాలని చెప్పారు.

**• అధికారులకు స్పష్టమైన హెచ్చరిక**

పని చేసే వాతావరణం కల్పించే బాధ్యత తనదని, పని చేయాల్సిన బాధ్యత అధికారులదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బాధ్యతతో పనిచేసే వారు కొనసాగాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారు రాజీనామా చేసి వెళ్లిపోవచ్చని ఘాటుగా హెచ్చరించారు. అవసరమైన నిధులు తీసుకురావడం తన బాధ్యత అని, పనులు వేగంగా పూర్తి చేయడం అధికారుల బాధ్యత అని చెప్పారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని తేల్చిచెప్పారు. పని ఒత్తిడి కారణంగా అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మునుగోడు ఏఈ నరేందర్‌ను కోమటిరెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. శాఖలో జరుగుతున్న పరిణామాలపై ఉన్నతాధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నరేందర్‌కు ధైర్యం చెబుతూ, త్వరగా కోలుకుని విధుల్లో చేరాలని కోరారు. తాను పూర్తి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

**• లో వోల్టేజీపై ట్రాన్స్‌కో సీఎండీతో చర్చ**

వర్షాభావ పరిస్థితుల్లో బోరుబావుల వినియోగం పెరగడం వల్ల లో వోల్టేజీ సమస్యలు అధికమయ్యే అవకాశం ఉందని ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో చర్చించారు. ఇప్పటికే మంజూరైన సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎండీ విద్యుత్ సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం మునుగోడు నియోజకవర్గంలో 31 సబ్‌స్టేషన్లు పనిచేస్తుండగా, కొత్తగా నిర్మించిన 6 సబ్‌స్టేషన్లు వినియోగంలోకి వచ్చాయని సమీక్షలో వెల్లడించారు. మరో 3 సబ్‌స్టేషన్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, 6 సబ్‌స్టేషన్లు టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు. మరో 3 సబ్‌స్టేషన్లకు భూ కేటాయింపు ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. ఈ పనులన్నింటినీ వేగంగా పూర్తి చేసి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించాలన్నారు. రైతులకు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# కీలక ప్రాజెక్టులకు సుప్రీం అభయం

## పర్యావరణ అనుమతులపై క్లారిటీ



### మంజూరైనవి చెల్లుబాటులోనే

తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఊరట కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను (ఓఎం) రద్దు చేసినప్పటికీ, ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులు పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఇచ్చిన ఈ తీర్పుతో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు ఎలాంటి చట్టపరమైన అడ్డంకులు ఉండవని స్పష్టత వచ్చింది.

### భవిష్యత్ ప్రాజెక్టులకు కఠిన నిబంధనలు

ఈ తీర్పు భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టులకు మాత్రమే వర్తిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇకపై కొత్త ప్రాజెక్టులు ప్రారంభించే ముందు తప్పనిసరిగా ముందస్తు పర్యావరణ అనుమతులు పొందాలని స్పష్టం చేసింది. కార్యనిర్వాహక ఉత్తర్వులతో చట్టాలను భర్తీ చేయడం సాధ్యం కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. దీంతో పర్యావరణ అనుమతుల ప్రక్రియ మరింత కట్టుదిట్టం కానుంది.

### నిర్మాణంలో ఉన్న పనులకు అడ్డంకులు లేవు

ఇప్పటికే పూర్తయిన ప్రాజెక్టులు, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పనులకు ఈ తీర్పు ఎలాంటి ఆటంకం కలిగించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీనివల్ల పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టుల పనులు యథావిధిగా కొనసాగనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యంగా భావిస్తున్న ఈ ప్రాజెక్టులకు చట్టపరమైన రక్షణ లభించినట్లయిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### మంత్రి తుమ్మల హర్షం

సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వాగతించారు. ఈ తీర్పుతో ఖమ్మం జిల్లాలోని సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు పూర్తిస్థాయి మార్గం సుగమమైందని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 36.37 టీఎంసీల నీటిని నిల్వ చేసి 6.74 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చని, అలాగే 282.80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉందని వివరించారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. పర్యావరణ అనుమతులు లభించేలా కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సంబంధిత అధికారులకు మంత్రి తుమ్మల ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో తెలంగాణ సాగునీటి రంగానికి కొత్త ఊపిరి లభించిందని చెప్పారు.

# ఓటరు జాబితాకు..

## సంక్షేమ పథకాలకు లింక్ లేదు

- ఆగస్టు 3లోగా సర్ పూర్తి చేయాల్సిందే
- తేల్చి చెప్పిన సీఈఓ సుదర్శన్ రెడ్డి




రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియ ఉద్దేశం తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించడమేనని తెలిపారు. ఓటర్లలో నెలకొన్న అపోహలను నమ్మవద్దని సూచించారు. బుధవారం జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ విషయాలను వెల్లడించారు.

### ఆగస్టు 3లోగా పూర్తి చేయాలని ఆదేశం

ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు మరో ఐదు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉందని సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఆగస్టు 3లోగా డిజిటలైజేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 76 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ 90 శాతానికి చేరుకుందని చెప్పారు. ఖానాపూర్, బాల్కొండ, ఎల్లారెడ్డి, హుజూర్‌నగర్, నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల, బోధ్ నియోజకవర్గాల్లో డిజిటలైజేషన్ పూర్తయిందని పేర్కొంటూ సంబంధిత అధికారులను అభినందించారు.

### పట్టణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

శేరిలింగంపల్లి, రంగారెడ్డి, మేడ్చల్, జీహెచ్ఎంసీ పరిధితో పాటు నిజామాబాద్, వరంగల్, ఖమ్మం పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ పనులు వేగవంతం చేయాలని సీఈఓ ఆదేశించారు. గడువులోగా ప్రక్రియ పూర్తి అయ్యేలా జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల వివరాలను అప్‌లోడ్ చేసే సమయంలో పేర్లు, ఇతర సమాచారం తప్పులు లేకుండా నమోదు చేయాలని బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు సూచించారు. ఈ ప్రక్రియను ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు.

### నిర్లక్ష్యంపై క్రమశిక్షణ చర్యలు

డిజిటలైజేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యం ప్రదర్శించిన బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని సుదర్శన్ రెడ్డి హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. ఒకే కుటుంబ సభ్యుల పేర్లు సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు చేపట్టాలని చెప్పారు.

### రాజకీయ పార్టీల సమక్షంలో ప్రక్రియ

మరణించిన ఓటర్లు, చిరునామా మార్చుకున్న వారు, అందుబాటులో లేని ఓటర్ల జాబితా సిద్ధం చేసే సమయంలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్ఏల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని సీఈఓ ఆదేశించారు. జిల్లా స్థాయిలో ఈఆర్‌వో, ఏఈఆర్‌వో, బీఎల్‌వో స్థాయిలో జరిగే రాజకీయ పార్టీల సమావేశాలను తప్పనిసరిగా వీడియోగ్రఫీ చేసి రికార్డు చేయాలని సూచించారు. వీఐపీ, వీవీఐపీ ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా గుర్తించి మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, డిప్యూటీ ఎన్నికల అధికారి చారి, పీఎం ఐటీ చిరంజీవి తదితర అధికారులు పాల్గొన్నారు.

# వాయుగుండం ఎఫెక్ట్

- ముంచెత్తుతున్న వర్షాలు!
- ఉత్తర తెలంగాణలో జోరు
- పలు జిల్లాలకు అలర్ట్

తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో వాగులు, వంకలు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో పంటలు నీటమునిగాయి. వరద ఉద్ధృతితో కొన్ని రహదారులు దెబ్బతినడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాల తీవ్రత మరింత ఎక్కువగా కనిపిస్తోంది.

**• మరో రెండు రోజులు భారీ వర్షాలు**

రాష్ట్రంలో ఇవాళ, రేపు కూడా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, పశ్చిమ, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో వర్షాలు మరింత ఉధృతంగా ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైతే మాత్రమే బయటకు రావాలని హెచ్చరించారు.

**• ఆరెంజ్ అలర్ట్ జిల్లాలు**

భారీ వర్షాల దృష్ట్యా హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించింది.

### కొనసాగుతున్న ఎల్లో అలర్ట్

ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, జనగాం, కామారెడ్డి, ఖమ్మం, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

**• భూపాలపల్లిలో తీవ్ర ప్రభావం**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా తడిసిముద్దవుతోంది. వాగులు పొంగిపొర్లుతుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు దెబ్బతిన్నాయి. జలాశయాలు పూర్తిస్థాయిలో నిండడంతో నీటిమట్టాలు పెరుగుతున్నాయి. హైదరాబాద్‌లో కూడా ఆకాశం మేఘావృతంగా ఉండటంతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వర్షాల తీవ్రత కొనసాగనున్న నేపథ్యంలో ప్రజలు అవసరం లేకుండా వరద ప్రాంతాలకు వెళ్లవద్దని, వాగులు, వంతెనలు దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు సూచించారు. రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తంగా ఉండి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది.



# నిజం దాచేందుకు ఎత్తుగడలు!

- ట్రైనీ ఐపీఎస్ రిమాండ్
- వేధింపుల కేసులో బిగిస్తున్న ఉచ్చు
- చంచల్‌గూడ జైలుకు తరలింపు

చట్టాన్ని కాపాడాల్సిన ఓ ట్రైనీ ఐపీఎస్ అధికారిపైనే తీవ్రమైన నేరారోపణలు రావడం సంచలనం సృష్టించింది. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఫిర్యాదుతో నమోదైన కేసులో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిర్యాలగూడలో అరెస్టు చేసిన అనంతరం ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు అప్పగించారు. బుధవారం ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరచగా, కోర్టు ఆగస్టు 11 వరకు 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం పోలీసులు ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

### 'రిలేషన్' పేరుతో వేధింపులు.. ఎఫ్ఐఆర్‌లో సంచలన ఆరోపణలు

బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, మొదట స్నేహాన్ని ఆధారంగా చేసుకుని దగ్గరైన నిందితుడు, తర్వాత అదే సంబంధాన్ని ఒత్తిడిగా మార్చినట్లు ఆరోపించింది. వాట్సాప్‌లో అసభ్య సందేశాలు పంపడమే కాకుండా, తమ ఇద్దరి మధ్య సంబంధం ఉందంటూ తోటి ట్రైనీ అధికారుల వద్ద ప్రచారం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మరో ట్రైనీ అధికారితో ఆమెకు అక్రమ సంబంధం ఉందంటూ నిరాధార ప్రచారం చేసి పరువు తీసేందుకు ప్రయత్నించినట్లు ఆరోపించారు. ఈ ఆరోపణలు ప్రస్తుతం పోలీసు దర్యాప్తులో భాగంగా పరిశీలనలో ఉన్నాయి.

### రహస్య వీడియోలు.. బ్లాక్‌మెయిల్ ప్రయత్నం?

ఎఫ్ఐఆర్‌లోని వివరాల ప్రకారం, బాధితురాలికి తెలియకుండా ఆమె వ్యక్తిగత వీడియోలను రికార్డు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ వీడియోలను చూపిస్తూ ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నించాడని, చివరకు ఆమె భర్తకు పంపి మానసికంగా కుంగదీసే ప్రయత్నం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాదు, ఆమె మొబైల్ ఫోన్‌ను బలవంతంగా తీసుకుని పాస్‌వర్డ్ చెప్పాలని బెదిరించినట్లు కూడా ఆరోపించారు. ఇవన్నీ ముందుగానే పథకం ప్రకారం చేసిన చర్యలుగా దర్యాప్తు అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

### గదిలో బంధించి.. కత్తితో బెదిరించాడనే ఆరోపణ

ఈ నెల 9 రాత్రి తన గదికి బలవంతంగా తీసుకెళ్లి బయటకు వెళ్లకుండా అడ్డుకున్నాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. జుట్టు పట్టుకుని లాగడం, గొంతు నులిమేందుకు ప్రయత్నించడం, మెడపై కత్తి పెట్టి భయపెట్టడం వంటి తీవ్ర ఆరోపణలు నమోదయ్యాయి. ఆమెను అవమానించేందుకు కండోమ్ ప్యాకెట్లను విసిరాడని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. మరుసటి రోజు కూడా శారీరకంగా దాడి చేశాడని ఆరోపించారు. అకాడమీలో ఇతరుల సమక్షంలో అసభ్యంగా మాట్లాడి పరువు తీసే ప్రయత్నం చేశాడని ఫిర్యాదులో వివరించారు.

### వైద్య పరీక్షల్లో గాయాల గుర్తింపు.. రిమాండ్‌కు కోర్టు ఆదేశం

పోలీసుల సమాచారం ప్రకారం, కేసు నమోదైన



తర్వాత బాధితురాలికి నిర్వహించిన వైద్య పరీక్షల్లో శారీరక గాయాల ఆనవాళ్లు గుర్తించినట్లు దర్యాప్తు అధికారులు కోర్టుకు వివరించారు. గొంతు వద్ద గాయాలు, చెంపపై దెబ్బల గుర్తులు, కాలిపై గాయం ఉన్నట్లు వైద్య నివేదికలో నమోదైనట్లు సమాచారం. ఈ ఆధారాలు, ఫిర్యాదులోని వివరాలను పరిశీలించిన అనంతరం కోర్టు నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించింది. కేసులో నమోదైన అన్ని ఆరోపణలపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితుడిపై ఉన్న ఆరోపణలు కోర్టులో ఇంకా నిరూపించాల్సి ఉంది.

# జగిత్యాలలో కేవీకే ఏర్పాటు చేయండి

## కేంద్ర మంత్రికి ఎంపీ అర్వింద్ విజ్ఞప్తి



కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ఎంపీ ధర్మపురి అర్వింద్ మర్యాదపూర్వకంగా కలిసి జగిత్యాల జిల్లాలో కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కేవీకే అవసరం ఎంతో ఉందని ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆధునిక సాగు విధానాలు, కొత్త సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ సలహాలు, రైతులకు శిక్షణ అందించడంలో కృషి విజ్ఞాన కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. దీంతో పంటల దిగుబడులు పెరగడంతో పాటు రైతుల ఆదాయం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలను గ్రామీణ ప్రాంతాలకు చేరవేయడంలో కేవీకేలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. జగిత్యాల జిల్లా రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేవీకే ఏర్పాటుకు సానుకూల నిర్ణయం తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ సందర్భంగా జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా ఇరువురు చర్చించినట్లు ఎంపీ అర్వింద్ వెల్లడించారు.

తరం తరం నరం నరం

# వందే మాతరం

- అవమానిస్తే జైలు శిక్ష!
- రాజ్యసభలో బిల్లుకు ఆమోదం

దేశభక్తికి ప్రతీకగా భావించే 'వందే మాతరం'ను అవమానించడం శిక్షార్హ నేరంగా ప్రకటించే జాతీయ గౌరవ పరిరక్షణ (సవరణ) బిల్లు-2026కు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. వాయిస్ ఓట్ ద్వారా బిల్లును ఆమోదించారు. ఈ బిల్లుతో వందే మాతరానికి జాతీయ గీతం 'జనగణమన'కు ఉన్నట్టే చట్టపరమైన రక్షణ కల్పించనున్నారు. దేశవ్యాప్తంగా వందే మాతరం 150వ వార్షికోత్సవ వేడుకలు జరుగుతున్న సమయంలో ఈ బిల్లుకు ఆమోదం లభించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

### మూడేళ్ల జైలు శిక్ష

ఈ సవరణ బిల్లు ప్రకారం వందే మాతరం, జాతీయ పతాకం, రాజ్యాంగం, జాతీయ గీతాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించడం నేరంగా పరిగణిస్తారు. అలాంటి చర్యలకు పాల్పడిన వారికి మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది. జాతీయ చిహ్నాల గౌరవాన్ని కాపాడటం, వాటిపై అవమానకర చర్యలను నిరోధించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

### ప్రతిపక్షాల నిరసన

బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు సభలో నినాదాలు చేశారు. నీట్ పేపర్ లీక్ నిరసనల్లో విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనల మధ్యే సభాపతి చర్చను కొనసాగించారు. అనంతరం కేంద్ర సామాజిక న్యాయ శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే మాట్లాడుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

### కాంగ్రెస్‌పై కేంద్రం విమర్శలు

బిల్లుపై సమాధానం ఇచ్చిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వందే మాతరాన్ని వ్యతిరేకించడం దేశ గౌరవాన్ని అవమానించడమేనని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్య సమరయోధులు ప్రాణత్యాగం చేసే చివరి క్షణాల్లో కూడా 'వందే మాతరం' నినాదం చేశారని గుర్తు చేశారు. దేశ సమైక్యతకు, 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' లక్ష్య సాధనకు వందే మాతరం స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఈ బిల్లుతో జాతీయ చిహ్నాల పరిరక్షణకు మరింత బలమైన చట్టపరమైన రక్షణ లభిస్తుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

# టీడీపీకి షాక్.. వైఎస్సార్‌సీపీలోకి కీలక నేతలు



గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు మండవ గౌతమ్, మండవ లక్ష్మీ నీరజ బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సమక్షంలో వారు పార్టీలో చేరగా, ఆయన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పొన్నూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. వైఎస్ జగన్ నాయకత్వం, ప్రజల పట్ల ఆయన నిబద్ధత, పార్టీ సిద్ధాంతాలు తమను ఆకట్టుకున్నాయని మండవ గౌతమ్, మండవ లక్ష్మీ నీరజ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ వేదికగా పనిచేస్తామని స్పష్టం చేశారు. మండవ గౌతమ్ గతంలో టీడీపీ బూత్ కమిటీ అధ్యక్షుడిగా, సొసైటీ అధ్యక్షుడిగా, పొన్నూరు మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. మండవ లక్ష్మీ నీరజ టీడీపీ మండల అధ్యక్షురాలిగా పనిచేయడంతో పాటు గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. పొన్నూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ నాయకులు పాల్గొన్నారు.

# గోకవరం అంగన్వాడీలకు కొత్త ఊపు

- నియామక పత్రాలు, ఇండక్షన్ స్టవ్ల పంపిణీ



కాకినాడ జిల్లా జగ్గంపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం గోకవరం మండలానికి చెందిన 7 మంది నూతన అంగన్వాడీ హెల్పర్లకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నియామక పత్రాలు అందజేశారు. కోరుకొండ ఐసీడీఎస్ సీడీపీఓ సంధ్యారాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గోకవరం మండలంలోని 74 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్లు, అంగన్వాడీ వర్కర్లకు యూనిఫాంలను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంధన పొదుపు, సురక్షితమైన వంట సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్లు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఐసీడీఎస్ అధికారులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు గుడ్ న్యూస్

- 7,437 పోలీసు ఉద్యోగాలు
- ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీ
- త్వరలో దరఖాస్తుల ప్రారంభం
- నిరుద్యోగ యువతకు బిగ్ రిలీఫ్

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది నిరుద్యోగ యువతకు ఎట్టకేలకు భారీ శుభవార్త అందింది. రాష్ట్ర పోలీసు శాఖలో భారీ స్థాయిలో ఖాళీల భర్తీకి తెలంగాణ రాష్ట్ర పోలీసు నియామక మండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 7,437 పోస్టులను భర్తీ చేయనున్న ఈ నియామక ప్రక్రియ రాష్ట్రంలో ఇటీవల కాలంలో వచ్చిన అతి పెద్ద ఉద్యోగ అవకాశాల్లో ఒకటిగా మారింది. నాలుగు వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా పోలీసు, ఫైర్ సర్వీసెస్, జైళ్ల శాఖల్లోని కీలక పోస్టులను భర్తీ చేయనున్నారు. ఉద్యోగం కోసం ఏళ్లుగా సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఇది బంగారు అవకాశంగా మారింది.

### ఏయే శాఖల్లో ఉద్యోగాలు?

ఈ నియామకాల ద్వారా సివిల్ పోలీసు, ఆర్మ్డ్ రిజర్వ్, తెలంగాణ స్పెషల్ పోలీసు, ఎస్‌ఏఆర్‌సీపీఎల్, ఫైర్ సర్వీసెస్, జైళ్ల శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయనున్నారు. చట్ట అమలు వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ భారీ నియామక ప్రక్రియను చేపట్టింది. ఒకేసారి పలు శాఖల్లో ఉద్యోగాలు భర్తీ కావడం వల్ల వివిధ అర్హతలు కలిగిన అభ్యర్థులకు అవకాశం దక్కనుంది.

### ఎస్ఐ నుంచి ఫైర్ ఫైటర్ వరకు

నోటిఫికేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు, రిజర్వ్ ఎస్ఐ పోస్టులు, ఫింగర్ ప్రింట్ బ్యూరోలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఉన్నాయి. పోలీసు కానిస్టేబుల్ పోస్టులు సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్, ఎస్‌ఏఆర్‌సీపీఎల్, డ్రైవర్, మెకానిక్ విభాగాల్లో భర్తీ చేయనున్నారు. ఫైర్ సర్వీసెస్‌లో స్టేషన్ ఫైర్ ఆఫీసర్, ఫైర్ ఫైటర్ పోస్టులు కూడా ఉన్నాయి. జైళ్ల శాఖలో డిప్యూటీ జైలర్, వార్డెన్ పోస్టులకు కూడా నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో ఒకే నియామక ప్రక్రియలో విభిన్న విభాగాల్లో ఉద్యోగాలు సాధించే అవకాశం అభ్యర్థులకు లభిస్తోంది.

### పోస్టుల వివరాలు ఇవే

సివిల్ ఎస్ఐ పోస్టులు 148, రిజర్వ్ ఎస్ఐ పోస్టులు 14, టీజీఎస్పీ రిజర్వ్ ఎస్ఐ పోస్టులు 12, ఎస్‌ఏఆర్‌సీపీఎల్ రిజర్వ్ ఎస్ఐ పోస్టులు 3, ఫింగర్ ప్రింట్ బ్యూరోలో అసిస్టెంట్ ఎస్ఐ పోస్టులు 23 ఉన్నాయి. అదనంగా 44 ప్రత్యేక ఎస్ఐ పోస్టులు కూడా భర్తీ చేయనున్నారు. కానిస్టేబుల్ పోస్టులు 1,380 ఉన్నాయి. ఫైర్ సర్వీసెస్‌లో 39 స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పోస్టులు, 751 ఫైర్ ఫైటర్ పోస్టులు ఉన్నాయి. జైళ్ల శాఖలో పురుషుల కోసం 14 డిప్యూటీ జైలర్ పోస్టులు, మహిళలకు ఒక డిప్యూటీ జైలర్ పోస్టు, పురుషుల వార్డెన్ పోస్టులు 196, మహిళల వార్డెన్ పోస్టులు 12 ఉన్నాయి. మిగిలిన పోస్టులు సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్, స్పెషల్ పోలీసు విభాగాల్లో భర్తీ చేయనున్నారు.

### త్వరలో పూర్తి షెడ్యూల్

దరఖాస్తుల స్వీకరణ తేదీలు, విద్యార్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్ నిబంధనలు, ఎంపిక విధానం, ప్రిలిమినరీ పరీక్ష, ఫిజికల్ టెస్టులు, తుది పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ రాష్ట్ర పోలీసు నియామక మండలి త్వరలో ప్రకటించనుంది. అధికారిక నోటిఫికేషన్‌ను పూర్తిగా పరిశీలించి అర్హతలు నిర్ధారించుకున్న తర్వాతే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పోలీసు ఉద్యోగమే లక్ష్యంగా సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఈ నియామక ప్రక్రియ కీలక అవకాశంగా మారనుంది.

# రాహుల్ వ్యాఖ్యలతో దద్దరిల్లిన సభ

- క్షమాపణకు సర్కార్ డిమాండ్
- చెప్పేదే లేదన్న కాంగ్రెస్ అగ్రనేత



లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు బుధవారం తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి. కాక్‌రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల నిరసనల సందర్భంగా పోలీసుల కాల్పులకు కేంద్ర హోంమంత్రి అమిత్ షానే ఆదేశాలు ఇచ్చారని రాహుల్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలతో అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు లేచి, ఎలాంటి ఆధారాలు లేకుండా చేసిన ఈ ఆరోపణలకు రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

### స్పీకర్ వద్ద చర్చలు

సభలో గందరగోళం పెరగడంతో సమావేశాన్ని మధ్యాహ్నం వాయిదా వేశారు. అనంతరం కిరణ్ రిజిజు పార్లమెంట్ భవనంలో అమిత్ షాతో సమావేశమై పరిస్థితిని వివరించారు. తర్వాత స్పీకర్ ఓం బిర్లాను కలిసి అధికారికంగా అభ్యంతరం తెలిపారు. అదే సమయంలో కాంగ్రెస్ నేతలు ప్రియాంక గాంధీ, కే.సి. వేణుగోపాల్, గౌరవ్ గొగోయ్ కూడా స్పీకర్‌ను కలిసి చర్చించారు. స్పీకర్ సమక్షంలో ఇరు పక్షాల మధ్య చర్చలు జరిగినట్లు సమాచారం.

### క్షమాపణపై ప్రతిష్ఠంభన

స్పీకర్ సమక్షంలో జరిగిన చర్చలో రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాల్సిందేనని కిరణ్ రిజిజు పట్టుబట్టినట్లు సమాచారం. ఇలాంటి సున్నితమైన అంశాలపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం తగదని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు రాహుల్ గాంధీ తన ప్రసంగాన్ని పూర్తి చేసే అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. అయితే క్షమాపణ లేకుండా సభ కొనసాగడం కష్టమని అధికార పక్షం స్పష్టం చేసింది.

### జితేంద్ర సింగ్ వివరణ

సభ తిరిగి ప్రారంభమైన తర్వాత కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ చర్చకు సమాధానం ఇచ్చారు. రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఒక్కొక్కటిగా ఖండించారు. కాల్పులు జరిగాయని చేసిన ఆరోపణ వాస్తవం కాదని చెప్పారు. అక్కడ టియర్ గ్యాస్ మాత్రమే ఉపయోగించారని వివరించారు. ఒకవేళ కాల్పులు జరిగినా ఆదేశాలు ఇవ్వగల అధికారం మంత్రి వద్ద కాదని, మేజిస్ట్రేట్ లేదా సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ వద్ద మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. హోంమంత్రి కాల్పులకు ఆదేశాలు ఇచ్చారన్న ఆరోపణకు పరిపాలనా పరంగా ఎలాంటి ఆధారం లేదని పేర్కొన్నారు.

### నిరసనల మధ్యే బిల్లు ఆమోదం

జితేంద్ర సింగ్ సమాధానం ఇస్తున్న సమయంలో కాంగ్రెస్ సభ్యులు సభ మధ్యలోకి వచ్చి నినాదాలు చేశారు. రాహుల్ గాంధీకి మిగిలిన ప్రసంగం పూర్తి చేసే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గందరగోళం కొనసాగుతున్నప్పటికీ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026ను వాయిస్ ఓట్ ద్వారా ఆమోదించారు. అనంతరం లోక్‌సభను రోజంతా వాయిదా వేశారు. ఈ పరిణామాలతో బుధవారం పార్లమెంట్ సమావేశాలు తీవ్ర ఉద్రిక్తత మధ్య ముగిశాయి.

# దాడులు చేయడం దుర్మార్గం

- లోక్ సభ సాక్షిగా రాహుల్ దూకుడు
- అమిత్ షా లక్ష్యంగా విమర్శల దాడి
- విద్యార్థుల నిరసనలే దేశ భవిష్యత్!
- ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ ఆరోపణలు



నీట్ పేపర్ లీక్ నిరసనల సందర్భంగా విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలను ప్రస్తావిస్తూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర విమర్శలు చేశారు. హోంమంత్రి సభలో లేకపోవడం భయంతోనేనని వ్యాఖ్యానించారు. పలు నగరాల్లో విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలకు అమిత్ షానే బాధ్యత వహించాలని ఆరోపించారు. అయితే ఈ వ్యాఖ్యలను సభా రికార్డుల నుంచి తొలగించారు. ఈ అంశంపై చర్చ జరగడం లేదని స్పీకర్ ఓం బిర్లా సూచిస్తూ, ఆరోపణలకు ఆధారాలు చూపాలని కోరారు.

### సభలో తీవ్ర అభ్యంతరాలు

ఇదే సమయంలో రాహుల్ వ్యాఖ్యలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారాలతో ఆరోపణలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇలాంటి వ్యాఖ్యలు అనుచితమని పేర్కొంటూ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సభలో కొంతసేపు గందరగోళం నెలకొంది. స్పీకర్ పలు మార్లు జోక్యం చేసుకుని చర్చను అసలు అంశానికి పరిమితం చేయాలని సూచించారు.

### ఆర్ఎస్ఎస్‌పై ఘాటు విమర్శలు

విద్యా వ్యవస్థపై కూడా రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. విద్యాశాఖను అధికారికంగా మంత్రి నడపడం లేదని, ఆర్ఎస్ఎస్ ప్రభావమే ఎక్కువగా ఉందని ఆరోపించారు. విద్యార్థులకు బోధించే చరిత్ర, పాఠ్యాంశాలపై కూడా ఆర్ఎస్ఎస్ ప్రభావం ఉందని వ్యాఖ్యానించారు. ధర్మేంద్ర ప్రధాన్ కేవలం ప్రతీక మాత్రమేనని, అసలు నిర్ణయాలు వేరే చోట నుంచి వస్తున్నాయని అన్నారు. ఈ వ్యాఖ్యలు అధికార పక్ష సభ్యుల నుంచి తీవ్ర నిరసనకు దారితీశాయి.

### విద్యార్థుల ఉద్యమానికి మద్దతు

నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు చేపట్టిన నిరసనలను రాహుల్ గాంధీ ప్రశంసించారు. ఈ ఉద్యమం కోపం కాదని, దేశ యువత తమ భవిష్యత్తు కోసం వ్యక్తం చేసిన భావోద్వేగమని చెప్పారు. ప్రతి రాజకీయ పార్టీ ఈ స్వరాన్ని గౌరవించాలని సూచించారు. ఒక విద్యార్థినితో జరిగిన సంభాషణను ప్రస్తావిస్తూ, నిజమైన విద్యార్థి ఎప్పుడూ కొత్త విషయాలను నేర్చుకోవడానికి సిద్ధంగా ఉంటాడని, వినయం అతని గొప్ప లక్షణమని పేర్కొన్నారు. తనకు తెలిసినదే అంతా అన్న భావన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. సభలో ఆయన ఉపయోగించిన కొన్ని పదాలపై స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో వాటిని కూడా పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించారు.

# పేపర్ లీక్‌లపై కేంద్రం ఉక్కుపాదం

- కొత్త చట్టంతో కఠిన చర్యలు!
- 10 ఏళ్ల జైలు, ₹ 50 లక్షల జరిమానా
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టులతో వేగంగా విచారణ

దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల్లో పేపర్ లీక్‌లకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026ను తీసుకొచ్చింది. ఇటీవల జరిగిన విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ఈ బిల్లుకు రూపకల్పన జరిగింది. పరీక్షల విశ్వసనీయతను కాపాడటం, అక్రమాలకు పాల్పడే వ్యక్తులు, ముఠాలు, సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యంగా కేంద్రం పేర్కొంది.

### శిక్షలు భారీగా పెంపు

ఈ సవరణ బిల్లులో వ్యక్తిగతంగా పేపర్ లీక్‌లకు పాల్పడిన వారికి గరిష్ఠంగా 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.50 లక్షల జరిమానా విధించే ప్రతిపాదన ఉంది. గత చట్టంలో గరిష్ఠ జరిమానా రూ.10 లక్షలే ఉండగా, ఇప్పుడు దానిని ఐదు రెట్లు పెంచారు. సంస్థల డైరెక్టర్లు, ఉన్నతాధికారులు కుట్రలో భాగమైతే కనిష్ఠ శిక్షను కూడా పెంచారు. వ్యవస్థీకృతంగా నేరాలకు పాల్పడే ముఠాలపై రూ.10 కోట్ల వరకు జరిమానా, గరిష్ఠంగా ఏడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం కల్పించారు.

### ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు


పేపర్ లీక్ కేసుల దర్యాప్తు కోసం కేంద్రానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసే అధికారం ఈ బిల్లు కల్పిస్తోంది. అవసరమైతే కేసులను కేంద్ర దర్యాప్తు సంస్థలకు అప్పగించే అవకాశం కూడా ఉంటుంది. ప్రతి కేసు దర్యాప్తును రెండు నెలల్లో పూర్తి చేయాలని చట్టంలో గడువు నిర్దేశించారు. దీంతో విచారణ వేగవంతం కావడంతో పాటు నిందితులపై త్వరగా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

### ఫాస్ట్‌ట్రాక్ కోర్టులతో తీర్పులు

పేపర్ లీక్ కేసుల విచారణ కోసం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని బిల్లు ప్రతిపాదిస్తోంది. చార్జిషీట్ దాఖలైన తర్వాత మూడు నెలల్లోనే విచారణ పూర్తి చేసి తీర్పు ఇవ్వాలని నిబంధన రూపొందించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకానికి కూడా అవకాశం కల్పించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల తీర్పులపై హైకోర్టులో అప్పీల్ చేసేందుకు 30 రోజుల గడువు ఉంటుంది. ఆ అప్పీల్‌లను కూడా మూడు నెలల్లోనే పరిష్కరించాలని బిల్లులో పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, విద్యార్థుల్లో నమ్మకాన్ని బలోపేతం చేయడం, పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశంగా కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

# ఆలస్యంగా జనన–మరణ నమోదు

- ఇక కష్టం.. కేంద్రం కొత్త బిల్లు!
- రెండేళ్లు దాటితే కఠిన నిబంధనలు
- లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టిన కేంద్రం



జననాలు, మరణాల నమోదులో ఆలస్యాన్ని మరింత కఠినంగా నియంత్రించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఆఫ్ బర్త్స్ అండ్ డెత్స్ (సవరణ) బిల్లు-2026ను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ప్రతిపక్షాల నిరసనల మధ్య కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. పేపర్ లీక్ అంశంపై ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి సభకు రావాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసినప్పటికీ, సభా కార్యక్రమాలు కొనసాగాయి.

### ఆలస్య నమోదుపై కొత్త విధానం

జననం లేదా మరణం జరిగిన తర్వాత ఒకటి నుంచి రెండు సంవత్సరాల మధ్య నమోదు చేసుకునే విధానంలో పెద్దగా మార్పులు ఉండవని బిల్లు స్పష్టం చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్నట్టుగానే జిల్లా కలెక్టర్, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ లేదా సంబంధిత ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అనుమతితో నమోదు చేసుకునే అవకాశం కొనసాగుతుంది. ఈ విధానం యథాతథంగా కొనసాగనుంది.

### రెండేళ్లు దాటితే న్యాయ అనుమతి తప్పనిసరి


రెండేళ్లకు మించి ఆలస్యంగా జననం లేదా మరణం నమోదు చేయాలంటే ఇకపై మరింత కఠిన నిబంధనలు అమల్లోకి రానున్నాయి. అలాంటి సందర్భాల్లో కార్యనిర్వాహక అధికారుల అనుమతి సరిపోదు. ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుంది. దీంతో చాలా ఆలస్యంగా జరిగే నమోదులపై న్యాయపరమైన పరిశీలన మరింత పెరగనుంది.

### పారదర్శకతే ప్రధాన లక్ష్యం

జననాలు, మరణాల నమోదులో అక్రమాలు, తప్పుడు ధ్రువీకరణలు, నకిలీ నమోదులను అరికట్టడమే ఈ సవరణ బిల్లు ప్రధాన ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఆలస్య నమోదుల విషయంలో మరింత బాధ్యతాయుతమైన విధానం అమలు చేయడం ద్వారా ప్రభుత్వ రికార్డుల విశ్వసనీయతను పెంచాలని భావిస్తోంది. 1969లో అమల్లోకి వచ్చిన చట్టానికి 2023లో సవరణలు చేసిన తర్వాత ఇప్పుడు మరోసారి మార్పులు ప్రతిపాదించడం ద్వారా నమోదు వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ బిల్లు ఆమోదం పొందితే రెండేళ్లకు మించి జరిగే ప్రతి ఆలస్య నమోదు న్యాయస్థానం పర్యవేక్షణలోనే జరిగేలా కొత్త విధానం అమల్లోకి రానుంది.

# వేలంకలో ఇంటింటికి టీడీపీ

- ప్రజా సమస్యలపై నెహ్రూ దృష్టి



కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వేలంక గ్రామంలో బుధవారం "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాల, హైస్కూల్‌ను పరిశీలించి విద్యార్థులకు అవసరమైన వసతులపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి నాణ్యతలో రాజీ పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రచ్చబండలో ప్రజల వినతులు స్వీకరించి సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని జ్యోతుల నెహ్రూ అన్నారు. గత రెండేళ్లలో ఒక్క వేలంక గ్రామానికే పెన్షన్లు, రైతు భరోసా, వ్యవసాయ సహాయం, ఇళ్ల నిర్మాణం, ఆటో డ్రైవర్ల సంక్షేమంతో కలిపి రూ.9.16 కోట్లకు పైగా లబ్ధి అందించామని తెలిపారు. చిల్లంగి-పెద్దాపల్లి వయా వేలంక 3.25 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.2.14 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు

- బాబ్రీపై అభిప్రాయం దేశద్రోహం కాదు
- భిన్నాభిప్రాయం నేరం కానేరదు
- ప్రాథమిక హక్కులకు రక్షణకే తీర్పు

బాబ్రీ మసీదు కూల్చివేతను విమర్శించడం దేశద్రోహం కాదని బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేసే హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. అలాంటి అభిప్రాయాలను దేశ వ్యతిరేక చర్యలుగా పరిగణించడం సరైంది కాదని పేర్కొంది. ఈ సందర్భంగా ముంబైలోకి ఏడాది పాటు ప్రవేశాన్ని నిషేధిస్తూ ఇద్దరు సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) సభ్యులపై జారీ చేసిన బహిష్కరణ ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది.

### కేసు నేపథ్యం

ఫిరోజ్ అబ్దుల్ వహాబ్ ఖాన్, మహ్మద్ రఫీక్ గులాం రసూల్ అన్సారీ అనే ఇద్దరు ఎస్‌డీపీఐ సభ్యులపై 2025 డిసెంబర్ 3న ముంబై పోలీసులు బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వారు హైకోర్టును ఆశ్రయించారు. 2024, 2025 సంవత్సరాల్లో నమోదైన మూడు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నట్లు పోలీసులు కోర్టుకు తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లు వ్యతిరేక నిరసనలు, చెంబూర్-గోవండి ప్రాంతంలో సిమెంట్ గోదాముల వల్ల ఏర్పడిన కాలుష్యం, బాబ్రీ మసీదు కూల్చివేతకు సంబంధించిన నిరసనలే ఈ కేసుల ప్రధాన అంశాలుగా ఉన్నాయి.

### ఎంపిక చేసుకుని చర్యలు ఎందుకు?

విచారణ సందర్భంగా న్యాయమూర్తి మాధవ్ జమ్దార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకే మతానికి చెందిన వ్యక్తులపై మాత్రమే చర్యలు తీసుకోవడం చట్టబద్ధం కాదని మౌఖికంగా వ్యాఖ్యానించారు. ఇదే నిరసనల్లో ఇతర ప్రతిపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నప్పటికీ వారిపై ఇలాంటి చర్యలు తీసుకోలేదని కోర్టు గుర్తు చేసింది. ముఖ్యంగా నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) నేతలపై బహిష్కరణ చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించింది.

### ఆధారాలు లేవని కోర్టు వ్యాఖ్య

బాబ్రీ మసీదు అంశంపై నినాదాలు చేయడం వల్ల సమాజంలో విభేదాలు తలెత్తుతాయని ప్రభుత్వం వాదించింది. అయితే ఆ వాదనకు మద్దతుగా ఎలాంటి ఆధారాలు సమర్పించలేదని హైకోర్టు పేర్కొంది. ప్రజల శాంతిభద్రతలకు ముప్పు ఏర్పడుతుందనే ఊహాగానాల ఆధారంగా ప్రాథమిక హక్కులను పరిమితం చేయలేమని స్పష్టం చేసింది. అభిప్రాయ స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని న్యాయస్థానం గుర్తుచేసింది.

### బహిష్కరణ అసాధారణ చర్య

ఒక వ్యక్తి సంచార స్వేచ్ఛను పరిమితం చేసే బహిష్కరణ ఉత్తర్వులు అత్యంత అసాధారణ చర్యలని హైకోర్టు పేర్కొంది. అలాంటి నిర్ణయాలు తీసుకునే ముందు చట్టంలోని ప్రతి నిబంధనను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. తగిన ఆధారాలు లేకుండా వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. ఈ తీర్పు అభిప్రాయ స్వేచ్ఛ, సమానత్వం, చట్టబద్ధ ప్రక్రియకు ప్రాధాన్యం ఇస్తూ భవిష్యత్‌లో ఇలాంటి కేసుల విచారణకు మార్గదర్శకంగా నిలుస్తుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## సీఎంతో ఎమ్మెల్యే నల్లిమిల్లి భేటీ

**అనపర్తి అభివృద్ధి నిధులపై చర్చ**



అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనపర్తి నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ప్రజలకు అవసరమైన కీలక పనులపై ముఖ్యమంత్రితో విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రతి నియోజకవర్గం సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, అనపర్తి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు కృషి కొనసాగుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు.

## కోనసీమ అభివృద్ధే లక్ష్యం


**మంత్రి వాసంశెట్టి సుభాష్**



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నివాసంలో నిర్వహించిన జిల్లా సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, మహిళా సాధికారత, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం కీలక కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు. కోనసీమ జిల్లాలో రహదారులు, విద్యా సంస్థలు, వైద్య సేవలు, వ్యవసాయ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విజయాలను సోషల్ మీడియా, ఇంటింటి ప్రచారం, గ్రామస్థాయి సమావేశాల ద్వారా ప్రజలకు చేరవేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, టీడీపీ జిల్లా నాయకులు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## తూర్పుకాపులకు ఓబీసీ రిజర్వేషన్ ఇవ్వాలని జగన్‌కు వినతి

తూర్పుకాపులకు కేంద్ర ఓబీసీ రిజర్వేషన్ కల్పించేలా చర్యలు తీసుకోవాలని తూర్పుకాపు విద్యా విజ్ఞాన అభివృద్ధి సంఘం ప్రతినిధులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కోరారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జీవో నంబర్ 82 ద్వారా తూర్పుకాపులను బీసీలుగా గుర్తించిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్రంలో బీసీ హోదా ఉన్నప్పటికీ కేంద్ర ఓబీసీ జాబితాలో పూర్తి గుర్తింపు లేకపోవడంతో విద్య, ఉద్యోగాల్లో లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత నష్టపోతున్నారని వివరించారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సంఘం ప్రతినిధుల విజ్ఞప్తిని విన్న వైఎస్ జగన్ తూర్పుకాపుల న్యాయమైన డిమాండ్‌కు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ ఎంపీల ద్వారా ఈ సమస్యను పార్లమెంట్‌లో లేవనెత్తడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి తూర్పుకాపులకు ఓబీసీ రిజర్వేషన్ ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.




# జగన్‌కు లోకేశ్ బహిరంగ సవాల్

టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు మరోసారి బహిరంగ సవాల్ విసిరారు. ఆదోని నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన ఆయన, మెగా డీఎస్సీపై ఎలాంటి సందేహాలున్నా బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. "నేను టెన్త్ తప్పిన బ్యాచ్ కాదు... స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్‌ని. డేట్, టైమ్ నిర్ణయించు... చర్చకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా?" అంటూ జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. డీఎస్సీ నియామకాలపై ఆరోపణలు చేయడం కంటే వాస్తవాలపై చర్చించాలని అన్నారు.

**సీబీఐ విచారణపై ప్రశ్నల వర్షం**

సీబీఐ విచారణ కోరుతున్నవారే గత కేసుల్లో కోర్టుల నుంచి స్టేలు ఎందుకు తెచ్చుకున్నారని లోకేశ్ ప్రశ్నించారు. బాబాయి హత్య కేసు, అక్రమాస్తుల కేసులపై విచారణను ఎందుకు ఎదుర్కోలేదని జగన్‌ను నిలదీశారు. గ్రూప్ 1 ప్రశ్నాపత్రాల లీకేజీ, మద్యం వ్యవహారాలపైకూడా బహిరంగంగా మాట్లాడేందుకు సిద్ధమని చెప్పారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలకు కాలం చెల్లిందన్నారు.
(వివరాలు 5లో..)

## ఇంటింటికి తెలుగుదేశం జోరు

- మూడు రోజుల్లో 6.20 లక్షల ఇళ్లకు
- లోకేశ్ పర్యవేక్షణలో కార్యక్రమం




## బన్నీ పొలిటికల్ టీజర్

# సందేశమా.. సంకేతమా..?

సినిమాలో హీరో ఎంట్రీకి ముందు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ పెరుగుతుంది... క్లైమాక్స్‌కు ముందు ట్విస్ట్ పడుతుంది... ఇంటర్వెల్‌కు ముందు ఒక్క డైలాగ్ థియేటర్‌ను షేక్ చేస్తుంది. ఇప్పుడు అల్లు అర్జున్ చుట్టూ నడుస్తున్న చర్చ కూడా అలాంటి సస్పెన్స్ సీన్‌లానే కనిపిస్తోంది. ఇది కొత్త సినిమా ప్రమోషనా..? కొత్త ప్రయాణానికి నాందీనా..? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఒక్క మాట... వంద అర్థాలు. ఒక్క చిరునవ్వు... వేల విశ్లేషణలు. బన్నీ మాట్లాడితే అభిమానులు సెలబ్రేట్ చేస్తారు... రాజకీయ వర్గాలు మాత్రం డీకోడ్ చేయడం మొదలుపెడతాయి. "పుష్ప"లో చెప్పిన "తగ్గేదేలే" డైలాగ్ దేశవ్యాప్తంగా మార్మోగినట్లే... ఇప్పుడు ఆయన పలికిన సంయమన సందేశం కూడా కొత్త చర్చకు తెరలేపింది. ఇది కామెడీ ట్రాక్ కాదు... యాక్షన్ బ్లాక్ కూడా కాదు... అసలు కథ మొదలయ్యే ముందు వచ్చే సైలెంట్ బిల్డప్‌లా కనిపిస్తోంది. దర్శకుడు స్క్రిప్ట్ దాచినట్టే... రాజకీయాల స్క్రీన్‌పైనా ఏదైనా ట్విస్ట్ దాగి ఉందా..? లేక ఇదంతా అభిమానుల ఊహలేనా..? సమాధానం ఇంకా రాలేదు. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం... బన్నీ పేరు వినిపిస్తే ఇప్పుడు బాక్సాఫీస్ మాత్రమే కాదు... రాజకీయ కారిడార్లూ ఒక్కసారిగా అలర్ట్ అవుతున్నాయి.

# వ్యవస్థలను ధ్వంసం చేయడమే లక్ష్యమా?

◆ **జగన్ శ్రీకాకుళం పర్యటనపై చంద్రబాబు ఆగ్రహం**

రాజకీయాల్లోకి వచ్చే వారు వ్యవస్థలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో పనిచేయాలని, కానీ వాటిని ధ్వంసం చేయాలనే ఉద్దేశంతో వ్యవహరించడం ప్రమాదకరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. చట్టాన్ని గౌరవించే నాయకత్వానికి, నేరాలను ప్రోత్సహించే రాజకీయాలకు చాలా తేడా ఉంటుందని వ్యాఖ్యానించారు.

**సిదిరి అప్పలరాజు పరామర్శపై ప్రశ్నలు**

శ్రీకాకుళం జైలులో ఉన్న వైసీపీ నేత, మాజీ మంత్రి సిదిరి అప్పలరాజును గురువారం వైఎస్ జగన్ పరామర్శించనున్నారని పార్టీ నాయకులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, సాక్ష్యాలను తారుమారు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని పరామర్శించడం ద్వారా సమాజానికి ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు. చట్టపరమైన విచారణను ఎదుర్కొంటున్న వారిని రాజకీయంగా సమర్థించడం ప్రజలకు సరైన సంకేతం కాదని అన్నారు. (వివరాలు 5లో..)

## సాక్ష్యాలు తారుమారు చేసిన వ్యక్తికి పరామర్శలా?






## ఏపీపై తైవాన్ ఫోకస్

- చంద్రబాబు, లోకేశ్‌తో కీలక భేటీ
- సెమీకండక్టర్ పెట్టుబడులకు ఆసక్తి!

(వివరాలు 5లో..)

## జగన్ శ్రీకాకుళం పర్యటన

**పర్యటనకు పరిమిత అనుమతులా? • ఆంక్షలు ఎందుకంటూ వైసీపీ విమర్శలు**

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకాకుళం పర్యటన నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. జగన్ పర్యటనను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఆరోపించింది. పర్యటనకు వచ్చే నేతలు, కార్యకర్తలపై కేసులు పెడతామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించింది. ప్రజలు పెద్ద సంఖ్యలో రాకుండా పోలీసులు ఆంక్షలు విధించారని పేర్కొంది. కేవలం ఎనిమిది వాహనాలకు మాత్రమే అనుమతి ఇవ్వడం ప్రభుత్వ ఒత్తిడి వల్లేనని వైఎస్సార్‌సీపీ ఆరోపించింది. అయితే భద్రత, శాంతిభద్రతల దృష్ట్యా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. (వివరాలు 5లో..)



## ఏం జరుగుతోంది

- నిన్న బోండా, నేడు అఖిలప్రియ
- నేతలకు హైకమాండ్ వార్నింగ్
- బోండా వ్యవహారంలో ట్విస్ట్!

తెలుగుదేశం పార్టీ నేతలు ఎవరూ పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా మాట్లాడొద్దని ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కొంతమంది నేతల వ్యాఖ్యలతో పార్టీ కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అందుకే ప్రతి నాయకుడు పార్టీ లైన్‌కు కట్టుబడి ఉండాలని సూచించారు. (వివరాలు 5లో..)






## మద్యం కేసులో కారుమూరికి షాక్

**ముందస్తు బెయిల్‌కు సుప్రీంకోర్టు నో!**

ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత కారుమూరి నాగేశ్వరరావుకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. (వివరాలు 2లో..)

## జోగి కుటుంబానికి చిక్కులు

- ముందస్తు బెయిల్ కోసం
- కోర్టుకు కుటుంబ సభ్యులు
- వరకట్నం, హత్యాయత్నం కేసు

మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేశ్ కుటుంబానికి సంబంధించిన కేసు మరో మలుపు తిరిగింది. తమను అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ జోగి రమేశ్ కుటుంబ సభ్యులు విజయవాడ మహిళా కోర్టును ఆశ్రయించారు. (వివరాలు 5లో..)



# మాటల మంటలు




## • విద్యార్థులే కేంద్రబిందువు • పార్లమెంట్‌లో పొలిటికల్ ఫైట్!

## • ఆరోపణలు.. సవాళ్లతో వేడెక్కిన సభ

విద్యార్థుల సమస్యలే ప్రధాన చర్చ కావాల్సిన పార్లమెంట్ వేదిక, ఇప్పుడు రాజకీయ ఆరోపణలు.. ప్రత్యారోపణలకు కేంద్రంగా మారింది. ఢిల్లీలో విద్యార్థుల నిరసనలపై పోలీసు చర్యలను ప్రస్తావిస్తూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని తీవ్రంగా డిమాండ్ చేస్తే, మరోవైపు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాత్రం అసలు చర్చ జరగాల్సింది పేపర్ లీక్ నిరోధక బిల్లుపైనేనని ఎదురుదాడికి దిగారు. విద్యార్థులపై జరిగిన ఘటనకు పూర్తి బాధ్యత కేంద్రానిదేనని రాహుల్ ఆరోపిస్తుంటే, విద్యార్థుల భవిష్యత్తును కాపాడే చట్టంపై కాంగ్రెస్ ఎందుకు మాట్లాడలేదని రిజిజు ప్రశ్నించారు. ఒకవైపు పోలీసు దౌర్జన్యంపై న్యాయం కోరుతున్నామని కాంగ్రెస్ చెబుతుంటే, మరోవైపు పరీక్షల పారదర్శకత కోసం తీసుకొచ్చిన చట్టాన్ని రాజకీయాల కోసం పక్కదారి పట్టిస్తున్నారని బీజేపీ విమర్శిస్తోంది. సభలో మాట్లాడనివ్వలేదని రాహుల్ అసంతృప్తి వ్యక్తం చేస్తే, మాట్లాడే అవకాశం వచ్చినా పేపర్ లీక్ బిల్లుపై ఒక్క మాట కూడా చెప్పలేదని రిజిజు బహిరంగ సవాల్ విసిరారు. ఒకరు బాధ్యత.. జవాబుదారీతనాన్ని ప్రశ్నిస్తుంటే, మరొకరు చట్టసభలో నిర్మాణాత్మక చర్చకే ప్రాధాన్యం ఇవ్వాలని చెబుతున్నారు.

## రాహుల్‌కు రిజిజు సవాల్!

**తప్పుదోవపట్టిస్తున్నారన్న మంత్రి**

పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లుపై చర్చను కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగా పక్కదారి పట్టిస్తోందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. విద్యార్థుల ప్రయోజనాల కోసం తీసుకొచ్చిన కీలక బిల్లుపై చర్చించాల్సిన సమయంలో ప్రతిపక్షాలు సంబంధం లేని అంశాలను ప్రస్తావిస్తూ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. లోక్‌సభ ఆవరణలో మీడియాతో మాట్లాడిన ఆయన, బిల్లుపై కాంగ్రెస్ నేతలు ఒక్క మాట కూడా మాట్లాడలేదని అన్నారు.

## షాకు రాహుల్ ఫిటింగ్

- విద్యార్థులపై పోలీసు దాడి
- రాజీనామా చేసి తీరాల్సిందే!

ఢిల్లీలో విద్యార్థుల నిరసనల సందర్భంగా జరిగిన పోలీసు చర్యలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమిత్ షాను పదవి నుంచి తొలగించి, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర ఉన్నత స్థాయి కమిటీతో దర్యాప్తు చేపట్టాలని కోరారు. విద్యార్థులపై జరిగిన దాడికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.




## గ్రీన్ కార్డ్‌కు కొత్త దారి!

**అమెరికా సెనేట్‌లో కొత్త బిల్లు**

**హెచ్-1బీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్**

**ఏడేళ్లున్న భారతీయులకు భారీ ఊరట**

అమెరికాలో దీర్ఘకాలంగా నివసిస్తున్న వలసదారులకు శాశ్వత నివాస హోదా కల్పించే లక్ష్యంతో కొత్త బిల్లును అమెరికా సెనేట్‌లో ప్రవేశపెట్టారు. కాలిఫోర్నియాకు చెందిన డెమోక్రటిక్ సెనేటర్ అలెక్స్ పడిల్లా ఈ ప్రతిపాదన తీసుకొచ్చారు. (వివరాలు 7లో..)



## ఈ20 పెట్రోల్‌పై కేంద్రం క్లారిటీ

- పాత వాహనాలకు చిన్న మార్పులే!
- రాజ్యసభలో నితిన్ గడ్కరీ వివరణ

ఈ20 ఇంధనం వాడే బీఎస్3 వాహనాల్లో కొన్ని రబ్బర్ భాగాలు, గ్యాస్కెట్లు మార్చాల్సి వచ్చే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. రాజ్యసభలో కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ విషయాన్ని తెలిపారు. (7లో..)




## బ్రహ్మ ముహూర్తంలో రామాయణం


ట్రైలర్ విడుదలలో కొత్త థియరీ



## రాజకీయ దుమారం

- జెన్ జీపై మాటల యుద్ధం
- కంగనాకు సౌరవ్, సోనూ కౌంటర్

ఒక మాట... సోషల్ మీడియాలో పోస్ట్. మరో స్పందన... రాజకీయ దుమారం. ఆ వెంటనే సినీ ప్రముఖుడి ఎంట్రీ. ఇలా జెన్ జీ యువతపై చేసిన ఒక వ్యాఖ్య ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. (వివరాలు 5లో..)




## టీటీడీ పేరుతో నకిలీ వెబ్‌సైట్

**ఫేక్ లింకులతో సైబర్ మోసం**

**భక్తులకు పాలకమండలి హెచ్చరిక**

తిరుమల తిరుపతి దేవస్థానం పేరుతో సైబర్ నేరగాళ్లు భక్తులను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు హెచ్చరించారు. టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌ను పోలి ఉండే నకిలీ వెబ్‌సైట్‌ను రూపొందించి అర్జిత సేవలు, వీఐపీ బ్రేక్ దర్శనం, శ్రీవాణి ట్రస్ట్ టికెట్లు అందుబాటులో ఉన్నట్లు చూపిస్తూ డబ్బులు వసూలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. (వివరాలు 5లో..)

## సాక్ష్యాలు తారు మారు చేసిన
# వ్యక్తికి పరామర్శలా?

**వ్యవస్థలను ధ్వంసం చేయడమే లక్ష్యమా?**
**జగన్ శ్రీకాకుళం పర్యటనపై చంద్రబాబు ఆగ్రహం**

రాజకీయాల్లోకి వచ్చే వారు వ్యవస్థలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో పనిచేయాలని, కానీ వాటిని ధ్వంసం చేయాలనే ఉద్దేశంతో వ్యవహరించడం ప్రమాదకరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. చట్టాన్ని గౌరవించే నాయకత్వానికి, నేరాలను ప్రోత్సహించే రాజకీయాలకు చాలా తేడా ఉంటుందని వ్యాఖ్యానించారు.

**సిదిరి అప్పలరాజు పరామర్శపై ప్రశ్నలు**

శ్రీకాకుళం జైలులో ఉన్న వైసీపీ నేత, మాజీ మంత్రి సిదిరి అప్పలరాజును గురువారం వైఎస్ జగన్ పరామర్శించనున్నారని పార్టీ నాయకులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, సాక్ష్యాలను తారుమారు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని పరామర్శించడం ద్వారా సమాజానికి ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు. చట్టపరమైన విచారణను ఎదుర్కొంటున్న వారిని రాజకీయంగా సమర్థించడం ప్రజలకు సరైన సంకేతం కాదని అన్నారు.

**వైసీపీపై తీవ్ర ఆరోపణలు**

నేరప్రవృత్తి కలిగిన వారిని ప్రోత్సహించడం వైసీపీ రాజకీయ సంస్కృతిగా మారిందని చంద్రబాబు ఆరోపించారు. గతంలో జరిగిన కొన్ని ఘటనలను ప్రస్తావిస్తూ, కారు ప్రమాదంలో వ్యక్తి మరణించినప్పుడు బాధితుడికి సాయం చేయాలనే మానవత్వం కూడా చూపలేదని విమర్శించారు. పుట్టినరోజు వేడుకల్లో గొర్రెల్లతో జంతు బలులు ఇవ్వడం వంటి ఘటనలను ప్రస్తావిస్తూ హింసాత్మక ధోరణి ఆ పార్టీ సంస్కృతిని ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించారు.

**సీసీ కెమెరాలపై వ్యాఖ్యలు**

2014 నుంచి 2019 మధ్య రాష్ట్రవ్యాప్తంగా 15 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని చంద్రబాబు గుర్తు చేశారు. అనంతర కాలంలో వాటి నిర్వహణ లేకపోవడంతో అవి నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పునరుద్ధరించడంతో నేరాలను సాక్ష్యాలతో సహా వెలికితీయగలుగుతున్నామని చెప్పారు. సాంకేతికతను సమర్థంగా వినియోగించడం వల్ల నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా జరుగుతోందని వివరించారు.

**పాస్టర్ ప్రవీణ్ ఘటన ప్రస్తావన**

పాస్టర్ ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మరణించిన ఘటనను హత్యగా చిత్రీకరించి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం జరిగిందని చంద్రబాబు ఆరోపించారు. సీసీటీవీ ఆధారాలు బయటకు వచ్చిన తర్వాత ఆ ప్రచారం నిలిచిపోయిందని అన్నారు. నేరం చేసిన వారే దానిని ఇతరులపై నెట్టే ప్రయత్నం చేస్తారని వ్యాఖ్యానించారు. గంజాయి ముఠాలతో కలిసి నేరస్థులను పరామర్శించడం వైసీపీ పనిగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో చట్ట పాలనను బలోపేతం చేయడం, నేరాలను కట్టడి చేయడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

# ఇంటింటికి తెలుగుదేశం జోరు

- మూడు రోజుల్లో 6.20 లక్షల ఇళ్లకు
- లోకేశ్ పర్యవేక్షణలో కార్యక్రమం




తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ఇంటింటికి తెలుగుదేశం-2026" కార్యక్రమం మూడో రోజూ రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా కొనసాగింది. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ నిర్ణయాలపై ప్రజల అభిప్రాయాలను కూడా తెలుసుకున్నారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ పార్టీ బలోపేతానికి ఈ కార్యక్రమం దోహదపడుతోందని టీడీపీ నాయకత్వం పేర్కొంది.

**మూడు రోజుల్లో 6.20 లక్షల ఇళ్ల సందర్శన**

మూడో రోజు ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 2.60 లక్షల ఇళ్లను టీడీపీ శ్రేణులు సందర్శించాయి. దీంతో మూడు రోజుల్లో మొత్తం 6.20 లక్షల ఇళ్లకు చేరుకున్నట్లు పార్టీ వెల్లడించింది. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమం వంటి అంశాలను ప్రజలకు వివరించారు.

**రాయలసీమలో విశేష స్పందన**

మూడో రోజు రాష్ట్రంలోని 98.5 శాతం క్లస్టర్లు, అన్ని మండలాలు, 81.6 శాతం యూనిట్లలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పార్టీ ప్రకటించింది. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు తెలిపింది. అక్కడ అత్యధిక స్థాయిలో ఇంటింటి సందర్శనలు నమోదైనట్లు వెల్లడించింది. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని పార్టీ ప్రతినిధులతో మాట్లాడినట్లు నాయకులు పేర్కొన్నారు.

**లోకేశ్ సాంకేతిక పర్యవేక్షణ**

తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా పురోగతిని సమీక్షిస్తూ అవసరమైన సూచనలు ఇస్తున్నారు. ప్రతి ప్రాంతంలో కార్యక్రమం సమర్థవంతంగా అమలయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సాంకేతిక వ్యవస్థ ద్వారా సమాచారం సేకరిస్తూ కార్యక్రమాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు.



## కుప్పంలో భువనేశ్వరి పర్యటన

టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి మూడో రోజూ కుప్పం నియోజకవర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. వసనాడు, వేపూరు గ్రామాల్లో మహిళలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను కూడా వివరించారు. ప్రజలతో నేరుగా మాట్లాడుతూ వారి అభిప్రాయాలను తెలుసుకోవడం ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసే అవకాశం లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంచిందని టీడీపీ నాయకత్వం వెల్లడించింది.

# జగన్ శ్రీకాకుళం పర్యటన

- పర్యటనకు పరిమిత అనుమతులా?
- ఆంక్షలు ఎందుకంటూ వైసీపీ విమర్శలు



వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకాకుళం పర్యటన నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. జగన్ పర్యటనను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఆరోపించింది. పర్యటనకు వచ్చే నేతలు, కార్యకర్తలపై కేసులు పెడతామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించింది. ప్రజలు పెద్ద సంఖ్యలో రాకుండా పోలీసులు ఆంక్షలు విధించారని పేర్కొంది. కేవలం ఎనిమిది వాహనాలకు మాత్రమే అనుమతి ఇవ్వడం ప్రభుత్వ ఒత్తిడి వల్లేనని వైఎస్సార్‌సీపీ ఆరోపించింది. అయితే భద్రత, శాంతిభద్రతల దృష్ట్యా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

**సీదిరి అప్పలరాజును పరామర్శించనున్న జగన్**

జగన్ గురువారం ఉదయం తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి విశాఖపట్నం మీదుగా శ్రీకాకుళం చేరుకోనున్నారు. అక్కడ అంపోలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ములాఖత్‌లో కలిసి పరామర్శించనున్నారు. ఆయనపై నమోదైన కేసు అక్రమమని, రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని వైఎస్సార్‌సీపీ ఆరోపిస్తోంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇలాంటి పరిస్థితుల్లో ధైర్యంగా ఉండాలని జగన్ భరోసా ఇవ్వనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పరామర్శ అనంతరం ఆయన తిరిగి ప్రయాణం కానున్నారు. ఈ పర్యటన రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది.



# ఏపీపై తైవాన్ ఫోకస్

- చంద్రబాబు, లోకేశ్‌తో కీలక భేటీ
- సెమీకండక్టర్ పెట్టుబడులకు ఆసక్తి!

ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో తైవాన్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామిక ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో అమరావతిలో సమావేశమైంది. రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమల విస్తరణ, సాంకేతిక సహకారంపై విస్తృతంగా చర్చించారు. డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్‌క్యూ సహా పలు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక అనుకూల విధానాలు, పోర్టులు, రహదారులు, విమానాశ్రయాలు, లాజిస్టిక్స్ సదుపాయాల గురించి చంద్రబాబు వివరించారు. పెట్టుబడిదారులకు వేగవంతమైన అనుమతులు, పూర్తి ప్రభుత్వ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

**లోకేశ్‌తో నైపుణ్యాల చర్చ**

తైవాన్ ప్రతినిధులు అనంతరం మంత్రి నారా లోకేశ్‌తో సమావేశమై రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు అందించే అంశంపై చర్చించారు. సెమీకండక్టర్లు, ప్రిసిషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, హెల్త్‌కేర్ వంటి రంగాల్లో శిక్షణ, ఉపాధి అవకాశాలను పెంచేందుకు కలిసి పనిచేయాలని నిర్ణయించారు. మాండరిన్ భాష శిక్షణ, సర్టిఫికేషన్ కోర్సులు, ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థి-అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలపై కూడా చర్చ జరిగింది. ఈ భాగస్వామ్యం ద్వారా రాష్ట్రానికి విదేశీ పెట్టుబడులు పెరగడంతో పాటు యువతకు ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

## టీటీడీ పేరుతో నకిలీ వెబ్‌సైట్

- ఫేక్ లింకులతో సైబర్ మోసం
- భక్తులకు పాలకమండలి హెచ్చరిక

తిరుమల తిరుపతి దేవస్థానం పేరుతో సైబర్ నేరగాళ్లు భక్తులను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు హెచ్చరించారు. టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌ను పోలి ఉండే నకిలీ వెబ్‌సైట్‌ను రూపొందించి అర్జిత సేవలు, వీఐపీ బ్రేక్ దర్శనం, శ్రీవాణి ట్రస్ట్ టికెట్లు అందుబాటులో ఉన్నట్లు చూపిస్తూ డబ్బులు వసూలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. టికెట్లు బుక్ చేసే సమయంలో భక్తుల వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఆన్‌లైన్ చెల్లింపు వివరాలను సేకరించి సైబర్ మోసాలకు పాల్పడే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. అధికారిక వెబ్‌సైట్‌లా కనిపించడం వల్ల చాలా మంది సులభంగా మోసపోయే అవకాశం ఉందని టీటీడీ పేర్కొంది.

**అధికారిక వెబ్‌సైట్‌లోనే బుకింగ్**

దర్శనం, అర్జిత సేవలు, వసతి, శ్రీవాణి ట్రస్ట్ టికెట్ల బుకింగ్‌ను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ లేదా అధికారిక మొబైల్ యాప్ ద్వారానే చేసుకోవాలని అధికారులు సూచించారు. సోషల్ మీడియాలో కనిపించే ప్రకటనలు, వాట్సాప్‌లో వచ్చే లింకులు, తెలియని వెబ్‌సైట్లను నమ్మవద్దని హెచ్చరించారు. వెబ్‌సైట్ చిరునామాను తప్పనిసరిగా పరిశీలించిన తర్వాతే ఆన్‌లైన్ చెల్లింపులు చేయాలని తెలిపారు. అనుమానాస్పద వెబ్‌సైట్లు లేదా ఫేక్ లింకులు కనిపిస్తే వెంటనే టీటీడీ అధికారులకు లేదా సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అప్రమత్తంగా ఉంటేనే ఇలాంటి సైబర్ మోసాల నుంచి రక్షణ పొందవచ్చని, వ్యక్తిగత వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియని వెబ్‌సైట్లలో నమోదు చేయవద్దని టీటీడీ భక్తులకు మరోసారి సూచించింది.

## జగన్‌కు లోకేశ్
# బహిరంగ సవాల్

- డీఎస్సీపై ముఖాముఖి చర్చకు సిద్ధమా?




టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు మరోసారి బహిరంగ సవాల్ విసిరారు. ఆదోని నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన ఆయన, మెగా డీఎస్సీపై ఎలాంటి సందేహాలున్నా బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. "నేను టెన్త్ తప్పిన బ్యాచ్ కాదు... స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్‌ని. డేట్, టైమ్ నిర్ణయించు... చర్చకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా?" అంటూ జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. డీఎస్సీ నియామకాలపై ఆరోపణలు చేయడం కంటే వాస్తవాలపై చర్చించాలని అన్నారు.

**సీబీఐ విచారణపై ప్రశ్నల వర్షం**

సీబీఐ విచారణ కోరుతున్నవారే గత కేసుల్లో కోర్టుల నుంచి స్టేలు ఎందుకు తెచ్చుకున్నారని లోకేశ్ ప్రశ్నించారు. బాబాయి హత్య కేసు, అక్రమాస్తుల కేసులపై విచారణను ఎందుకు ఎదుర్కోలేదని జగన్‌ను నిలదీశారు. గ్రూప్ 1 ప్రశ్నాపత్రాల లీకేజీ, మద్యం వ్యవహారాలపై కూడా బహిరంగంగా మాట్లాడేందుకు సిద్ధమని చెప్పారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలకు కాలం చెల్లిందన్నారు.

**డీఎస్సీపై టీడీపీ వాదన**

డీఎస్సీ నియామకాలు టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పెద్ద ఎత్తున జరిగాయని లోకేశ్ చెప్పారు. గతంలో రెండు లక్షల మంది ఉపాధ్యాయులకు ఉద్యోగాలు ఇచ్చిన ఘనత టీడీపీదేనని పేర్కొన్నారు. ప్రస్తుతం 16 వేల ఉపాధ్యాయ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేశామని వెల్లడించారు. ఈ నియామకాలను రద్దు చేయాలని పిటిషన్లు వేయడం వల్ల అత్యధికంగా నష్టపోయేది నిరుద్యోగ యువతేనని అన్నారు. ముఖ్యంగా కర్నూలు జిల్లా అభ్యర్థులపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెప్పారు.

**అభివృద్ధి వర్సెస్ విధ్వంసం**

గత ఐదేళ్లలో భోగాపురం విమానాశ్రయం సహా కీలక ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని లోకేశ్ విమర్శించారు. ఇప్పుడు పూర్తవుతున్న ప్రతి ప్రాజెక్టుకు తామే కారణమని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని ఆరోపించారు. పరిశ్రమలు తరలిపోయిన పరిస్థితిని మార్చి తిరిగి పెట్టుబడులు తీసుకొస్తున్నామని చెప్పారు. జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్టు, కడప స్టీల్ ప్లాంట్, టాటా సోలార్, డ్రోన్ సిటీ, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి పారిశ్రామిక ప్రాజెక్టులను ఉదాహరణగా ప్రస్తావించారు. రాయలసీమ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.

**కర్నూలుకు హైకోర్టు బెంచ్ హామీ**

యువగళం పాదయాత్ర సమయంలో న్యాయవాదులు చేసిన విజ్ఞప్తిని గుర్తుచేసిన లోకేశ్, కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకురావడానికి కట్టుబడి ఉన్నానని ప్రకటించారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇవ్వనని, అమలు చేయగల అంశాలనే ప్రజలకు చెబుతానన్నారు. ఆదోనిలో మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, ఐటీఐ, ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం కృషి చేస్తామని వెల్లడించారు. రాబోయే డీఎస్సీలో ఉర్దూ టీచర్ల నియామకాలు కూడా చేపడతామని చెప్పారు.

**కార్యకర్తలే పార్టీ బలం**

టీడీపీకి కార్యకర్తలే అసలైన బలమని లోకేశ్ స్పష్టం చేశారు. కష్టపడి పనిచేసే వారికి పదవులు వెదుక్కుంటూ వస్తాయని చెప్పారు. ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. "మై టీడీపీ" యాప్ ద్వారా ప్రజల అభిప్రాయాలను నమోదు చేయాలని కోరారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వం మరో మూడు పర్యాయాలు అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు.

## మద్యం కేసులో కారుమూరికి షాక్

**ముందస్తు బెయిల్‌కు సుప్రీంకోర్టు నో!**




ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత కారుమూరి నాగేశ్వరరావుకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. కేసు స్వభావం, దర్యాప్తు పురోగతిని పరిశీలించిన ధర్మాసనం ప్రస్తుతం ముందస్తు బెయిల్ ఇవ్వడం సరైనది కాదని స్పష్టం చేసింది. కేసులో ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని, సుమారు రూ.350 కోట్ల ప్రజాధనం దారి మళ్లినట్లు దర్యాప్తు సంస్థలు సమర్పించిన వివరాలు సూచిస్తున్నాయని కోర్టు పేర్కొంది. దీంతో కారుమూరికి తక్షణ ఉపశమనం లభించలేదు.

**కస్టడీ విచారణ అవసరమే**

ఈ కేసులో ఇంకా అనేక కీలక విషయాలు వెలుగులోకి రావాల్సి ఉన్నాయని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అందువల్ల నిందితుడిని కస్టడీలోకి తీసుకుని విచారించడం అవసరమని పేర్కొంది. కారుమూరి తరఫు న్యాయవాదులు ముందస్తు బెయిల్ ఇవ్వాలని పలు వాదనలు వినిపించినప్పటికీ ధర్మాసనం వాటిని అంగీకరించలేదు. దర్యాప్తు కీలక దశలో ఉన్నందున విచారణ సంస్థలకు పూర్తి అవకాశం ఇవ్వాలని సూచించింది. ఈ నిర్ణయంతో మద్యం కుంభకోణం కేసు దర్యాప్తు మరింత వేగం పుంజుకునే అవకాశం కనిపిస్తోంది. ఆర్థిక లావాదేవీలు, నిధుల మళ్లింపు అంశాలపై అధికారులు లోతుగా విచారణ చేపట్టే అవకాశం ఉండటంతో ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లో కూడా ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది.

## జోగి కుటుంబానికి చిక్కులు

- ముందస్తు బెయిల్ కోసం
- కోర్టుకు కుటుంబ సభ్యులు
- వరకట్నం, హత్యాయత్నం కేసు



మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేశ్ కుటుంబానికి సంబంధించిన కేసు మరో మలుపు తిరిగింది. తమను అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ జోగి రమేశ్ కుటుంబ సభ్యులు విజయవాడ మహిళా కోర్టును ఆశ్రయించారు. వరకట్న వేధింపులు, గృహహింస, హత్యాయత్నం ఆరోపణలతో నమోదైన కేసు నేపథ్యంలో ఈ పిటిషన్లు దాఖలయ్యాయి. మహిళా కోర్టు పిటిషన్‌ను విచారణకు స్వీకరించి, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులను కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. కేసు వివరాలు, దర్యాప్తు పురోగతిని కోర్టు ముందు ఉంచాలని సూచించింది. పోలీసులు తమ నివేదిక సమర్పించిన తర్వాత బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

**పెద్ద కోడలి ఫిర్యాదుతో దర్యాప్తు**

జోగి రమేశ్ పెద్ద కోడలు జోగి మేఘన ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె వరకట్న వేధింపులు, గృహహింస, హత్యాయత్నం ఆరోపణలు చేయడంతో మొత్తం 11 మందిని నిందితులుగా చేర్చారు. జోగి రమేశ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యుల పేర్లు కూడా ఎఫ్ఐఆర్‌లో ఉన్నాయి. ప్రస్తుతం పోలీసులు సాక్ష్యాధారాలు సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అరెస్ట్ అవకాశం ఉందన్న ఆందోళనతో కుటుంబ సభ్యులు ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. మహిళా కోర్టు తీర్పుపై రాజకీయ వర్గాల్లో కూడా ఆసక్తి నెలకొంది. ఈ కేసులో కోర్టు తీసుకునే నిర్ణయం, దర్యాప్తు పురోగతి రాబోయే రోజుల్లో కీలకంగా మారే అవకాశం ఉంది.

# ఏం జరుగుతోంది?



- నిన్న బోండా, నేడు అఖిలప్రియ
- నేతలకు హైకమాండ్ వార్నింగ్
- బోండా వ్యవహారంలో ట్విస్ట్!

తెలుగుదేశం పార్టీ నేతలు ఎవరూ పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా మాట్లాడొద్దని ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కొంతమంది నేతల వ్యాఖ్యలతో పార్టీ కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అందుకే ప్రతి నాయకుడు పార్టీ లైన్‌కు కట్టుబడి ఉండాలని సూచించారు. పార్టీ గీత దాటి వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కూటమి ధర్మాన్ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

**బోండా ఉమా వివరణపై సంతృప్తి**

అమరావతిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడు, పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బోండా ఉమామహేశ్వరరావు ఇచ్చిన వివరణతో పార్టీ అధిష్ఠానం సంతృప్తి చెందినట్లు పల్లా వెల్లడించారు. అయితే ఇది మినహాయింపు కాదని, ఇకపై పార్టీ లైన్‌కు విరుద్ధంగా మాట్లాడే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పార్టీ నియమావళిని ప్రతి నాయకుడు గౌరవించాలని సూచించారు.

**అఖిల ప్రియకు వార్నింగ్**

మరోవైపు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పల్లా శ్రీనివాస్‌తో సమావేశమయ్యారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు, పార్టీకి అందిన ఫిర్యాదులపై ఆమె నుంచి అధిష్ఠానం వివరణ కోరిన నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. అహోబిలం ఆలయంలో తలనీలాల కాంట్రాక్ట్ వ్యవహారంలో ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడం వివాదానికి దారితీసిందని, దీనిపై పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పల్లా తెలిపారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎవరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అలాగే ఈ వ్యవహారంలో అఖిలప్రియ భర్త జోక్యం చేసుకోకుండా చూడాలని పార్టీ అధినేత ఆదేశాలను ఆమెకు వివరించినట్లు సమాచారం.

**బోండా విషయంలో ఏం జరిగింది?**

పైకి అంతా ప్రశాంతంగా కన్పిస్తున్నా బొండా వ్యవహారంలో సంథింగ్ ఏదో జరుగుతోందన్న చర్చ సాగుతున్నట్టుగా తెలుస్తోంది. పార్టీతో వన్ వే కమ్యూనికేషన్లో ఆయన ఉన్నారన్న ప్రచారం కూడా పార్టీలో ఉంది. దీంతో తనను ఇరుకునపెడితే.. టీడీపీని టార్గెట్ చేయాలని ఆయన ఫిక్స్ అయినట్టుగా ప్రచారం జరుగుతోంది. అందరూ బోండా వైసీపీ వైపు చూస్తున్నారని అనుకుంటే.. ఆయన మాత్రం బీజేపీ వైపు చూస్తున్నారని కూడా బెజవాడ పొలిటికల్ సర్కిల్ లో ప్రచారం జరుగుతోంది. వైసీపీలో చేరితే టార్గెట్ అవుతానన్న ఆలోచన కూడా ఆయన చేసినట్టుగా ప్రచారం ఉంది. అయితే మొత్తం వ్యవహారంపై పార్టీ హైకమాండ్‌కు వివరణ తర్వాత కొంత కాలం ఆయన వేచి చూసే ధోరణి అవలంబించాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.

"గంగోత్రి"లో అమాయకుడు... "ఆర్య"లో ప్రేమికుడు... "దేశముదురు"లో దూకుడు... "పరుగు"లో పట్టుదల... "రేసుగుర్రం"లో వేగం... "సరైనోడు"లో మాస్... "అల వైకుంఠపురములో"లో క్లాస్... "పుష్ప"లో తగ్గేదేలే...! ఇప్పుడు కొత్త ప్రశ్న మాత్రం ఒక్కటే... "నెక్స్ట్ స్టెప్" రాజకీయాలవైపేనా..? సినిమా తెరపై పాత్రలను మార్చుకుంటూ కోట్లాది అభిమానులను అలరించిన స్టైలిష్ ఐకాన్ అల్లు అర్జున్... ఇప్పుడు రాజకీయ చర్చల్లోనూ హాట్ టాపిక్‌గా మారుతున్నారు. అభిమానులకు ఇచ్చిన ఒక సందేశం... సోషల్ మీడియాలో చేసిన ఒక వ్యాఖ్య... వేదికపై పలికిన కొన్ని మాటలు... ఇప్పుడు సినీ వర్గాల కంటే రాజకీయ వర్గాల్లోనే ఎక్కువగా విశ్లేషిస్తున్నారు. ఇది కేవలం అభిమానుల సమావేశమా..? లేక భవిష్యత్ రాజకీయ ప్రయాణానికి తొలి సంకేతమా..? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మరోవైపు అల్లు అరవింద్ వ్యూహాలపై కూడా ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఒకప్పుడు "పుష్ప" డైలాగులు దేశాన్ని ఊపేసినట్లే... ఇప్పుడు బన్నీ ప్రతి మాట రాజకీయ చర్చకు కేంద్రంగా మారుతోంది. ఇది కేవలం స్టార్ హీరో చుట్టూ తిరిగే ప్రచారమా..? లేక నిజంగానే కొత్త రాజకీయ అధ్యాయానికి నాంది పలికే పరిణామమా..? సమాధానం ఇంకా రాకపోయినా... చర్చ మాత్రం రోజురోజుకూ మరింత వేడెక్కుతోంది.



# సందేశమా.. సంకేతమా..?

## అల్లు రామలింగయ్య కామెడీ కాదు..!

## మెగాస్టార్ స్టైల్ కాదు..! ఇది అరవింద్ వ్యూహమా..?



ఒక స్టార్ హీరో వేదికపై మాట్లాడితే అభిమానులు చప్పట్లు కొడతారు. అదే వ్యాఖ్యలు రాజకీయ చర్చలు వేడెక్కిన సమయంలో వస్తే వాటి అర్థం మారిపోతుంది. ఒక్కో పదాన్ని విడదీసి విశ్లేషిస్తారు. ఒక్కో హావభావాన్ని రాజకీయ సంకేతంగా చూస్తారు. ప్రస్తుతం స్టైలిష్ ఐకాన్ అల్లు అర్జున్ చుట్టూ జరుగుతున్న పరిణామాలు కూడా అలాంటివే. హైదరాబాద్‌లో అభిమానులతో జరిగిన సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ రంగానికే కాదు, రాజకీయ వర్గాల్లో కూడా చర్చకు దారితీశాయి. "ఎవరినీ ద్వేషించవద్దు. ట్రోలింగ్‌కు దూరంగా ఉండండి. మీ సమయాన్ని కుటుంబం, భవిష్యత్తు కోసం వినియోగించండి" అని బన్నీ అభిమానులకు ఇచ్చిన సూచనలు మొదట సాధారణ సందేశంలా కనిపించాయి. కానీ గత కొంతకాలంగా ఆయన పేరు రాజకీయ చర్చల్లో వినిపిస్తున్న నేపథ్యంలో అదే వ్యాఖ్యలకు కొత్త అర్థాలు వెతకడం మొదలైంది.

### • అభిమానులకు సందేశమా.. రాజకీయాలకు సంకేతమా..?

అల్లు అర్జున్ చేసిన ప్రసంగాన్ని చాలామంది బాధ్యతాయుతమైన సందేశంగా స్వాగతించారు. అభిమానులు సోషల్ మీడియాలో పరస్పర దూషణలు చేయకుండా ఉండాలని, వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరడం సానుకూలంగా కనిపించింది. మరోవైపు కొందరు రాజకీయ విశ్లేషకులు మాత్రం ఈ వ్యాఖ్యల వెనుక భవిష్యత్ వ్యూహం ఉందా అనే కోణంలో పరిశీలించడం ప్రారంభించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రముఖ సినీ తారలు చేసే ప్రతి వ్యాఖ్య రాజకీయ అర్థాలను సంతరించుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో బన్నీ ప్రసంగం కూడా అదే తరహా విశ్లేషణలకు దారి తీసింది. ఈ రాజకీయ చర్చలకు ప్రధాన కారణం 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాలే. మెగా కుటుంబ సభ్యుల్లో చాలామంది జనసేనకు బహిరంగ మద్దతు ప్రకటించిన సమయంలో అల్లు అర్జున్ నంద్యాలకు వెళ్లి తన స్నేహితుడు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్రారెడ్డిని కలిశారు. వ్యక్తిగత స్నేహం కోసమే వెళ్లానని ఆయన స్పష్టం చేసినా, ఆ సంఘటన రాజకీయ చర్చలకు దారి తీసింది. అప్పటి నుంచి బన్నీ చేసే ప్రతి చర్యను రాజకీయ కోణంలో చూసే ధోరణి బలపడింది. సినిమా కార్యక్రమాలు కూడా రాజకీయ విశ్లేషణలకు వేదికలుగా మారుతున్న పరిస్థితి ఏర్పడింది.

### • సోషల్ మీడియాతో మారిన అభిమాన సంస్కృతి

హైదరాబాద్‌లో జరిగిన తాజా సమావేశానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, కర్ణాటక నుంచి కూడా అభిమానులు భారీగా హాజరయ్యారు. ముఖ్యంగా కేరళలో అల్లు అర్జున్‌కు ఉన్న అభిమాన వర్గం ప్రత్యేక గుర్తింపు పొందింది. "పుష్ప" తర్వాత ఆయనకు దేశవ్యాప్తంగా విస్తృత ఆదరణ లభించింది. ఈ సమావేశాన్ని కొందరు అభిమానుల కలయికగా చూస్తే, మరికొందరు అభిమాన సంఘాల విస్తరణలో భాగంగా విశ్లేషిస్తున్నారు. భారీ అభిమాన బలం భవిష్యత్తులో రాజకీయ ప్రభావాన్ని చూపుతుందా అనే ప్రశ్న కూడా వినిపిస్తోంది. ఒకప్పుడు అభిమాన సంఘాలు సినిమా విడుదలల సమయంలో పోస్టర్లు కట్టడం, పాలాభిషేకాలు చేయడం, కటౌట్లు ఏర్పాటు చేయడం వరకే పరిమితమయ్యేవి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. డిజిటల్ ప్రచారం, సామాజిక సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, భారీ సమావేశాలు నిర్వహించే స్థాయికి అభిమాన సంఘాలు ఎదిగాయి. సోషల్ మీడియా ద్వారా క్షణాల్లో లక్షల మందిని చేరుకునే శక్తి ఏర్పడింది. ఈ ప్రభావం కారణంగానే సినీ అభిమాన సంఘాలను రాజకీయ విశ్లేషకులు కూడా ఆసక్తిగా గమనిస్తున్నారు. అయితే అభిమాన సంఘాల చురుకుదనాన్ని నేరుగా రాజకీయ ప్రవేశానికి నిదర్శనంగా చెప్పే ఆధారాలు ఇప్పటివరకు లేవు.

### • అల్లు అరవింద్ పేరు ఎందుకు వినిపిస్తోంది..?

ఈ చర్చలో మరోసారి నిర్మాత అల్లు అరవింద్ పేరు కూడా ప్రస్తావనకు వస్తోంది. తెలుగు సినీ పరిశ్రమలో విజయవంతమైన నిర్మాతగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. వ్యూహాత్మక ఆలోచనలతో ముందుకు సాగే వ్యక్తిగా కూడా గుర్తింపు ఉంది. ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటైన సమయంలో పార్టీ వ్యవహారాల్లో ఆయన కీలక పాత్ర పోషించారనే రాజకీయ విశ్లేషణలు అప్పట్లో వినిపించాయి. పేరుకు ఆయన ప్రధాన కార్యదర్శి మాత్రమే ఐనా, పార్టీ నిర్వహణ అంతా తనే చూశారనే అభిప్రాయం బలంగా విన్పించింది. ఇదే కారణంగా ఇప్పుడు అల్లు అర్జున్ చుట్టూ జరుగుతున్న ప్రతి పరిణామంలో కూడా అల్లు అరవింద్ పేరు ప్రస్తావనకు వస్తోంది. అయితే దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. రాజకీయ చర్చలు, సోషల్ మీడియా ప్రచారం, అధికారిక వాస్తవాలు మూడు వేర్వేరు అంశాలు. అల్లు అర్జున్ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ఆయన గానీ, కుటుంబ సభ్యులు గానీ ఇప్పటివరకు ప్రకటించలేదు. అల్లు అరవింద్ కూడా బన్నీ రాజకీయ భవిష్యత్తుపై ఎలాంటి అధికారిక వ్యూహాన్ని వెల్లడించలేదు. కాబట్టి ప్రస్తుతం వినిపిస్తున్న చర్చలన్నీ విశ్లేషణల పరిధిలోనే ఉన్నాయి. అధికారిక ప్రకటన వచ్చే వరకు రాజకీయ ప్రవేశంపై వస్తున్న ప్రచారాన్ని నిజంగా పరిగణించడం సరైన విధానం కాదు.

### • సినీ చరిత్రే ఈ చర్చకు కారణం

భారత రాజకీయ చరిత్రలో సినీ తారలు రాజకీయాల్లోకి వచ్చిన ఉదాహరణలు చాలానే ఉన్నాయి. ఎంజీఆర్, ఎన్టీఆర్, జయలలిత, చిరంజీవి, పవన్ కళ్యాణ్ వంటి నాయకులు సినీ ప్రజాదరణను రాజకీయ బలంగా మార్చుకున్నారు. ఇటీవల తమిళనాడులో నటుడు విజయ్ రాజకీయ పార్టీ ప్రకటించడంతో సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చే అవకాశాలపై మళ్లీ చర్చ మొదలైంది. ఈ పరిణామాల ప్రభావం ఇతర రాష్ట్రాల సినీ తారలపై కూడా పడుతోంది. అందుకే భారీ అభిమాన బలం ఉన్న ప్రతి హీరోపై "రాజకీయాల్లోకి వస్తారా?" అనే ప్రశ్న సహజంగానే వినిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక సమీకరణాలు ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తుంటాయి. కాపు సామాజిక వర్గం రాజకీయ ప్రభావంపై చాలాకాలంగా చర్చ కొనసాగుతోంది. జనసేన ఆవిర్భావం తర్వాత ఈ చర్చ మరింత బలపడింది. ఈ నేపథ్యంలో అదే సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ సినీ వ్యక్తులపై రాజకీయ దృష్టి పడటం సహజమే. అల్లు అర్జున్ విషయంలో కూడా ఇలాంటి విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అయితే ఏ ఒక్క సామాజిక వర్గం మాత్రమే రాజకీయ విజయాన్ని నిర్ణయించదు. ప్రజా అంగీకారం, బలమైన సంస్థాగత నిర్మాణం, దీర్ఘకాలిక రాజకీయ కార్యాచరణ, నాయకత్వ సామర్థ్యం, ప్రజా సమస్యలపై స్పష్టమైన వైఖరి కూడా సమానంగా అవసరం.

### • పుష్ప తర్వాత మారిన బన్నీ స్టామినా!

"పుష్ప" సిరీస్ విజయంతో అల్లు అర్జున్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఆయన ఇప్పుడు కేవలం తెలుగు హీరో కాదు. పాన్ ఇండియా స్టార్ మాత్రమే కాదు. అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రత్యేక గుర్తింపు పొందిన భారతీయ నటుల్లో ఒకరిగా నిలిచారు. ఈ స్థాయిలో ఉన్న నటుడు రాజకీయాల్లోకి వస్తారా అనే ఆసక్తి సహజంగానే పెరుగుతోంది. ప్రస్తుతం ఆయన ముందున్న ప్రధాన లక్ష్యం తన తదుపరి చిత్రాలే. ప్రపంచవ్యాప్తంగా అభిమానులు కూడా వాటి కోసం ఎదురుచూస్తున్నారు. అయినప్పటికీ ఆయన చేసే ప్రతి సమావేశం, ప్రతి వ్యాఖ్య రాజకీయ కోణంలో కూడా విశ్లేషించబడుతోంది. అభిమానులకు అల్లు అర్జున్ ఇచ్చిన సందేశంలో ద్వేషానికి చోటు లేదు. ట్రోలింగ్‌కు దూరంగా ఉండాలని, కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వాలని, భవిష్యత్తు కోసం సమయాన్ని వినియోగించాలని ఆయన సూచించారు. ఈ సందేశాన్ని రాజకీయంగా చూడాలా, సామాజికంగా చూడాలా అనేది ఎవరి దృష్టికోణం వారిది. కానీ సందేశం మాత్రం సానుకూల ఆలోచనను ప్రోత్సహించేదే. సోషల్ మీడియాలో వ్యక్తిగత దాడులు తగ్గాలని, అభిమాన సంస్కృతి ఆరోగ్యకరమైన దిశగా వెళ్లాలని ఆయన కోరినట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

### • రాజకీయ ప్రవేశమా.. ఊహాగానాలా..?

ప్రస్తుతం అల్లు అర్జున్ చుట్టూ రాజకీయ ఆసక్తి పెరుగుతున్నది నిజం. అభిమాన సంఘాలు విస్తరిస్తున్నాయి. సోషల్ మీడియా ప్రతి వ్యాఖ్యను విశ్లేషిస్తోంది. రాజకీయ వర్గాలు కూడా ఆయన అడుగులను గమనిస్తున్నాయి. అయితే ఆసక్తి పెరగడం ఒక్కటే రాజకీయ ప్రవేశానికి నిదర్శనం కాదు. అధికారిక ప్రకటన వెలువడే వరకు రాజకీయాల్లోకి వస్తున్నారనే ప్రచారాన్ని ఊహాగానంగానే చూడాలి. నేడు అల్లు అర్జున్ కోట్లాది మంది అభిమానులను ప్రభావితం చేసే ప్రజాదరణ కలిగిన సినీ తార. అందుకే ఆయన పలికిన ప్రతి మాట వార్త అవుతోంది. ప్రతి సమావేశం చర్చకు దారి తీస్తోంది. ప్రతి అడుగు విశ్లేషణకు కారణమవుతోంది. భవిష్యత్తులో ఈ చర్చ నిజంగా రాజకీయ రూపం దాల్చుతుందా, లేక కేవలం ప్రచారంగానే మిగిలిపోతుందా అనే ప్రశ్నకు సమాధానం చెప్పేది కాలమే. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వాస్తవాల ప్రకారం అల్లు అర్జున్ రాజకీయ ప్రవేశంపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. అందువల్ల చర్చలు కొనసాగుతున్నా, తుది నిర్ణయం మాత్రం ఆయన ప్రకటించే వరకే వేచి చూడాల్సిందే.

### • క్లైమాక్స్ కాదు... అసలు ట్విస్ట్ మిగిలే ఉంది..!

తెరపై కథ ముగియాలంటే దర్శకుడు "కట్" చెప్పాలి. రాజకీయాల్లో కథ ముగియాలంటే ప్రజలే తీర్పు చెప్పాలి. ప్రస్తుతం అల్లు అర్జున్ చుట్టూ నడుస్తున్న చర్చ కూడా అలాంటిదే. బన్నీ పయనం పూర్తిగా సినిమాల వైపే కొనసాగుతుందా..? లేక ఏదో ఒకరోజు రాజకీయ వేదికపై కూడా అడుగుపెడతారా..? అన్న ప్రశ్నకు సమాధానం ఇప్పటికీ రాలేదు. అదే సమయంలో అల్లు అరవింద్ ఎలాంటి వ్యూహం రచిస్తారు..? సినీ ప్రపంచానికే పరిమితమవుతారా..? లేక భవిష్యత్తు పరిణామాల్లో కీలక పాత్ర పోషిస్తారా..? అన్న ఆసక్తి కూడా కొనసాగుతోంది. మరోవైపు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణం ఏ దిశగా సాగుతుంది..? మెగా కుటుంబ సమీకరణాలు ఎలా మారతాయి..? చిరంజీవి ఇప్పటిలాగే రాజకీయాలకు దూరంగా ఉంటారా..? లేక అవసరమైతే మరోసారి తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడిస్తారా..? అన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. ఇవన్నీ ప్రస్తుతం ప్రశ్నలే... సమాధానాలు కావు. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. మెగా కుటుంబానికి సంబంధించిన ప్రతి కదలిక తెలుగు రాష్ట్రాల్లో వార్త అవుతోంది. ప్రతి సమావేశం విశ్లేషణగా మారుతోంది. ప్రతి మాట రాజకీయ చర్చకు కేంద్రబిందువవుతోంది. తెరపై హీరో ఎప్పుడు ఎంట్రీ ఇస్తాడో దర్శకుడికి తెలుసు. రాజకీయాల్లో ఎప్పుడు ఎవరు ఎంట్రీ ఇస్తారో కాలమే చెబుతుంది. అప్పటి వరకు ఇది ముగిసిన కథ కాదు... ఇంకా ఇంటర్వెల్ కూడా కాకపోయిన రాజకీయ థ్రిల్లర్. అసలు క్లైమాక్స్ రాయబోయేది ప్రజలే.

**1. బన్నీ మాటల వెనుక రాజకీయ అర్థాలా..?**

అభిమానులకు అల్లు అర్జున్ ఇచ్చిన సంయమనం, ట్రోలింగ్‌కు దూరంగా ఉండాలనే సందేశం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు కారణమైంది. సాధారణ వ్యాఖ్యలకే రాజకీయ రంగు పులుముతున్నారు.

**2. 2024 ఎన్నికల నుంచే మొదలైన ప్రచారం**

నంద్యాలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్రారెడ్డిని కలిసిన ఘటన తర్వాత బన్నీ చేసే ప్రతి అడుగు రాజకీయ కోణంలోనే విశ్లేషించబడుతోంది.

**3. అల్లు అరవింద్ వ్యూహాలపై ఊహాగానాలు**

ప్రజారాజ్యం అనుభవం కారణంగా అల్లు అరవింద్ పేరు మరోసారి రాజకీయ చర్చల్లో వినిపిస్తోంది. అయితే దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.

**4. అభిమాన బలం... రాజకీయ ఆసక్తి**

తెలుగు రాష్ట్రాలతో పాటు కేరళ, కర్ణాటకలో ఉన్న భారీ అభిమాన వర్గం భవిష్యత్తులో రాజకీయ ప్రభావం చూపుతుందా అనే చర్చ కొనసాగుతోంది.

**5. అధికారిక ప్రకటన మాత్రం లేదు**

రాజకీయ ప్రవేశంపై అల్లు అర్జున్ గానీ, కుటుంబ సభ్యులు గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ప్రస్తుతం వినిపిస్తున్నవన్నీ విశ్లేషణలు, ఊహాగానాలుగానే ఉన్నాయి.



# బ్రహ్మ ముహూర్తంలో రామాయణం

- ట్రైలర్ విడుదలలో కొత్త థియరీ



బాలీవుడ్‌లో అత్యంత భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న 'రామాయణం' చిత్ర ట్రైలర్‌ను జూలై 30న ఉదయం 4:15 గంటలకు ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. నిర్మాత నమిత్ మల్హోత్రా ఈ సమయాన్ని ఉద్దేశపూర్వకంగానే ఎంచుకున్నారు. బ్రహ్మ ముహూర్తంలో ట్రైలర్‌ను విడుదల చేయడం ద్వారా చిత్రానికి ఆధ్యాత్మిక ఆరంభం ఇవ్వాలనే సంకల్పాన్ని ప్రకటించారు. సాధారణంగా ట్రైలర్లు ఎక్కువ మంది చూసే సమయాల్లో విడుదల అవుతాయి. ఈ నిర్ణయం మాత్రం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

### బ్రహ్మ ముహూర్తం విశిష్టత

హిందూ సంప్రదాయంలో బ్రహ్మ ముహూర్తం అత్యంత పవిత్రమైన కాలంగా భావిస్తారు. సూర్యోదయానికి సుమారు గంటన్నర ముందు ప్రారంభమై, సూర్యోదయానికి 48 నిమిషాల ముందు ముగుస్తుంది. ఈ సమయంలో ప్రార్థన, ధ్యానం, విద్యాభ్యాసం, ఆత్మపరిశీలన చేయడం అత్యంత శుభప్రదంగా చెబుతారు. ఈ సమయం పవిత్రత, సానుకూల శక్తి, జ్ఞానం, దైవ చైతన్యానికి ప్రతీకగా భావించబడుతుంది.

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు

దేశంలోని అనేక హిందూ దేవాలయాల్లో బ్రహ్మ ముహూర్తంలోనే ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయి. పూజారులు ఆలయాలను శుభ్రపరిచి సుప్రభాత సేవలు నిర్వహిస్తారు. శివాలయాల్లో అభిషేకాలు జరుగుతాయి. కేదార్‌నాథ్ వంటి ప్రముఖ క్షేత్రాల్లో తెల్లవారుజామున జరిగే మహా అభిషేక ఆరతిలో పాల్గొనడం భక్తులకు విశేష ఆధ్యాత్మిక అనుభూతిగా భావిస్తారు.

### భారీ బడ్జెట్‌తో రామాయణం

నితీష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలి భాగం నవంబర్ 8, 2026న విడుదల కానుంది. రెండో భాగం దీపావళి 2027 సందర్భంగా విడుదల చేయాలని ప్రణాళిక ఉంది. రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా నటిస్తున్నారు. రెండు భాగాల నిర్మాణ వ్యయం రూ.4,000 కోట్లకు పైగా ఉంటుందని నిర్మాత నమిత్ మల్హోత్రా ఇప్పటికే వెల్లడించడం ఈ చిత్రంపై అంచనాలను మరింత పెంచింది.

# టాలీవుడ్‌ను వెంటాడుతున్న సర్జరీలు

- స్టార్ హీరోలకు వరుసగా ఏమైంది?
- నలుగురు స్టార్ హీరోలకు ఆపరేషన్లు
- అభిమానుల్లో టెన్షన్.. కోలుకోవాలని ప్రార్థనలు
- ఏమైంది టాలీవుడ్‌కు..? స్టార్ హీరోలందరికీ వరుస గాయాలు!



**ఒక్కోసారి సినిమాల్లో హీరోలు గాయపడటం చూస్తాం. కానీ ఇప్పుడు నిజజీవితంలోనే టాలీవుడ్ అగ్రహీరోలు వరుసగా శస్త్రచికిత్సలు, గాయాలతో వార్తల్లో నిలుస్తుండటం అభిమానులను కలవరపెడుతోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సర్జరీ, మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ భుజానికి గాయం, నందమూరి నటసింహం బాలకృష్ణ కాలికి గాయం, అంతకుముందే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ భుజం శస్త్రచికిత్స... ఇలా ఒకరి తర్వాత ఒకరు అగ్ర కథానాయకులు ఆరోగ్య సమస్యలతో విశ్రాంతి తీసుకోవాల్సిన పరిస్థితి రావడం సినీ పరిశ్రమలో చర్చనీయాంశమైంది. కోట్లాది అభిమానులను ఉర్రూతలూగించే ఈ స్టార్ హీరోలు ప్రస్తుతం ఆసుపత్రులు, విశ్రాంతి గదులకే పరిమితమవడం ఆందోళన కలిగిస్తోంది. భారీ బడ్జెట్ సినిమాలు, కఠినమైన యాక్షన్ సన్నివేశాలు, నిరంతర షూటింగ్‌లు, రాజకీయ బాధ్యతలు, విరామం లేని జీవనశైలి ఈ పరిస్థితికి కారణమా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఒకేసారి నాలుగు అగ్రహీరోలు గాయాలు, సర్జరీలతో వార్తల్లో నిలవడం టాలీవుడ్ చరిత్రలో అరుదైన పరిణామంగా మారింది. ఇప్పుడు అభిమానుల చూపంతా ఒక్కటే... తమ అభిమాన హీరోలు పూర్తిగా కోలుకుని మళ్లీ అదే జోష్‌తో సెట్లలోకి అడుగుపెట్టి వెండితెరపై మాస్ మ్యాజిక్ సృష్టించే రోజెప్పుడు అని ఎదురుచూస్తున్నారు.**

తెలుగు సినీ పరిశ్రమలో గత కొద్ది వారాలుగా ఒక అరుదైన పరిణామం చోటుచేసుకుంది. సాధారణంగా ఒక్కో హీరో ఆరోగ్య సమస్యతో వార్తల్లో నిలవడం సహజమే. కానీ ఒకరి వెంట ఒకరు అగ్రశ్రేణి హీరోలు శస్త్రచికిత్సలు చేయించుకోవడం మాత్రం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మెగా కుటుంబానికి చెందిన పవన్ కళ్యాణ్, రామ్ చరణ్... నందమూరి కుటుంబానికి చెందిన బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ వరుసగా చికిత్సలు పొందడం అభిమానులను ఆందోళనకు గురిచేసింది. నాలుగు పెద్ద చిత్రాలు, భారీ ప్రాజెక్టులు, రాజకీయ బాధ్యతల మధ్య ఈ పరిణామం టాలీవుడ్‌లో "సర్జరీల సీజన్"గా మారింది.

### మొదట పవన్ కళ్యాణ్... భుజం శస్త్రచికిత్స

ఈ వరుసకు శ్రీకారం చుట్టింది ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్. చాలా కాలంగా వెంటాడుతున్న భుజం సమస్యకు వైద్యులు శస్త్రచికిత్స అవసరమని సూచించడంతో ముంబైలో ప్రత్యేక చికిత్స చేయించుకున్నారు. రాజకీయ కార్యక్రమాలు, వరుస పర్యటనలు, సినిమా షూటింగ్‌ల కారణంగా చాలా కాలంగా వాయిదా పడిన ఈ సర్జరీని చివరకు పూర్తి చేశారు. శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తికావడంతో వైద్యులు కొంతకాలం పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటూ ప్రభుత్వ కార్యక్రమాలను పరిమితంగా నిర్వహిస్తున్నారు.

### రామ్ చరణ్‌కు కూడా సర్జరీ

పవన్ కళ్యాణ్ చికిత్స అనంతరం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కూడా శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. విదేశాల్లో జరిగిన ఈ వైద్య ప్రక్రియ ముందుగానే ప్రణాళిక ప్రకారం నిర్వహించిన చికిత్సగా సినీ వర్గాలు తెలిపాయి. దీర్ఘకాలిక పనిభారం, యాక్షన్ సన్నివేశాలు, శారీరక ఒత్తిడి కారణంగా వచ్చిన సమస్యకు వైద్యులు చికిత్స సూచించినట్లు సమాచారం. సర్జరీ విజయవంతంగా పూర్తికావడంతో కొద్దిరోజుల విశ్రాంతి అనంతరం ఆయన మళ్లీ సినిమా పనుల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారు.

### బాలకృష్ణకు వైద్య చికిత్స

నందమూరి నటసింహం, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ కూడా ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారు. వయసుతో పాటు గతంలో వచ్చిన ఆరోగ్య సమస్యల కారణంగా వైద్యుల సలహాతో ఈ చికిత్స చేపట్టినట్లు తెలిసింది. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని సన్నిహిత వర్గాలు తెలిపాయి. వైద్యులు సూచించిన విశ్రాంతి తీసుకుంటూ త్వరలోనే రాజకీయ కార్యక్రమాలు, సినిమా షూటింగ్‌లలో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం.

### తాజాగా జూనియర్ ఎన్టీఆర్‌కు సర్జరీ

ఈ వరుసలో తాజాగా జూనియర్ ఎన్టీఆర్ కూడా చేరారు. గతంలో తలెత్తిన ఆరోగ్య సమస్యకు సంబంధించి వైద్యులు సూచించిన విధంగా ఆయన శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ చికిత్స ముందస్తు ప్రణాళికలో భాగంగానే జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారని, వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకుంటున్నారని తెలుస్తోంది. ఆయన తదుపరి సినిమా షెడ్యూళ్లు ఆరోగ్య పరిస్థితిని బట్టి ప్రారంభం కానున్నాయి.

### బాబాయ్–అబ్బాయ్‌లకు ఒకే సారి చికిత్స

ఈ పరిణామంలో మరో ఆసక్తికర అంశం కూడా ఉంది. మెగా కుటుంబంలో పవన్ కళ్యాణ్-రామ్ చరణ్ బాబాయ్-అబ్బాయ్. నందమూరి కుటుంబంలో బాలకృష్ణ-జూనియర్ ఎన్టీఆర్ కూడా అదే కుటుంబానికి చెందిన ప్రముఖ హీరోలు. ఈ రెండు కుటుంబాల్లోనూ ఒకే సమయంలో ఇద్దరు చొప్పున స్టార్ హీరోలు శస్త్రచికిత్సలు చేయించుకోవడం యాదృచ్ఛికమైనా, అభిమానుల్లో చర్చకు దారితీసింది. సోషల్ మీడియాలో ఈ అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

### అభిమానుల ఒక్కటే కోరిక

అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం ఈ నాలుగు శస్త్రచికిత్సలు అత్యవసర ప్రమాదాల కారణంగా జరిగినవి కావు. పాత గాయాలు, శారీరక ఒత్తిడి, దీర్ఘకాలిక సమస్యలు, వైద్యుల సలహా మేరకు నిర్ణయించిన చికిత్సలేనని తెలుస్తోంది. ఒకే సమయంలో టాలీవుడ్‌కు చెందిన నలుగురు అగ్రహీరోలు శస్త్రచికిత్సలు చేయించుకోవడం అరుదైన సంఘటనగా నిలిచింది. అభిమానులందరి ఆశ ఒక్కటే... తమ అభిమాన కథానాయకులు పూర్తిగా కోలుకుని, మళ్లీ అదే ఉత్సాహంతో షూటింగ్ సెట్లలోకి అడుగుపెట్టి, వెండితెరపై తమదైన ముద్ర వేయాలని కోరుకుంటున్నారు.

# ఈ20 పెట్రోల్‌పై కేంద్రం క్లారిటీ

- పాత వాహనాలకు చిన్న మార్పులే!
- రాజ్యసభలో నితిన్ గడ్కరీ వివరణ



ఈ20 ఇంధనం వాడే బీఎస్3 వాహనాల్లో కొన్ని రబ్బర్ భాగాలు, గ్యాస్కెట్లు మార్చాల్సి వచ్చే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. రాజ్యసభలో కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ విషయాన్ని తెలిపారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం, సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్, ఆటోమొబైల్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనాన్ని మంత్రి ప్రస్తావించారు. అయితే ఆ అధ్యయన నివేదికను ఇప్పటివరకు బహిర్గతం చేయలేదు.

### బీఎస్-3 వాహనాలకే సూచన

2005 ఏప్రిల్ 1 నుంచి ప్రవేశపెట్టిన బీఎస్3 ప్రమాణాల వాహనాలు, ముఖ్యంగా 2016కు ముందు తయారైన మోడళ్లలో కొన్ని రబ్బర్ భాగాలు, గ్యాస్కెట్లు మార్చాల్సి రావచ్చని అధ్యయనం పేర్కొంది. అయితే ఇది పెద్ద సమస్య కాదని, సాధారణ సర్వీసింగ్ సమయంలోనే ఈ మార్పులు సులభంగా చేయవచ్చని కేంద్రం తెలిపింది. ఇతర కార్లు, ద్విచక్ర వాహనాల ఇంజిన్లలో ఎలాంటి మార్పులు అవసరం లేదని స్పష్టం చేసింది.

### పనితీరుపై అధ్యయనం

ఈ20 ఇంధనం వాడటం వల్ల పాత వాహనాల పనితీరులో గణనీయమైన మార్పులు కనిపించలేదని అధ్యయనం వెల్లడించినట్లు నితిన్ గడ్కరీ చెప్పారు. ఇంజిన్‌లో అసాధారణ అరిగిపోవడం, లోహ భాగాలపై ప్రభావం, ప్లాస్టిక్ భాగాలకు నష్టం, వాహనం స్టార్ట్ కావడం, డ్రైవింగ్ సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం వంటి సమస్యలు గుర్తించలేదని వివరించారు. ఈ20 ఇంధనం వాడటం సురక్షితమేనని అధ్యయనం తేల్చిందని తెలిపారు.

### మైలేజీపై కేంద్రం స్పష్టీకరణ

వాహనం ఇచ్చే మైలేజీకి కేవలం ఇంధనం మాత్రమే కారణం కాదని కేంద్రం స్పష్టం చేసింది. డ్రైవింగ్ విధానం, వాహన నిర్వహణ, ఇంజిన్ ఆయిల్ మార్పు, ఎయిర్ ఫిల్టర్ శుభ్రత, టైర్ల గాలి ఒత్తిడి, వీల్ అలైన్‌మెంట్, ఎయిర్ కండీషనర్ వినియోగం వంటి అనేక అంశాలు ఇంధన సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తాయని నితిన్ గడ్కరీ వివరించారు. ఇటీవల ఈ20 ఇంధనంతో వాహనాలు మిస్‌ఫైర్ అవుతున్నాయని, మధ్యలో నిలిచిపోతున్నాయని కొన్ని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో కేంద్రం ఈ వివరణ ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# షాకు రాహుల్ ఫిటింగ్

- విద్యార్థులపై పోలీసు దాడి
- రాజీనామా చేసి తీరాల్సిందే!

ఢిల్లీలో విద్యార్థుల నిరసనల సందర్భంగా జరిగిన పోలీసు చర్యలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమిత్ షాను పదవి నుంచి తొలగించి, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర ఉన్నత స్థాయి కమిటీతో దర్యాప్తు చేపట్టాలని కోరారు. విద్యార్థులపై జరిగిన దాడికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

### పార్లమెంట్‌లో మాట్లాడనివ్వలేదు

ఈ అంశంపై లోక్‌సభలో మాట్లాడేందుకు తనకు అవకాశం ఇవ్వలేదని రాహుల్ ఆరోపించారు. పలుమార్లు సభాపతిని కోరినా మాట్లాడే అవకాశం రాలేదని చెప్పారు. రిజిజు, రాజ్‌నాథ్ సింగ్‌లకు మాట్లాడే అవకాశం ఇచ్చి తనను అడ్డుకున్నారని విమర్శించారు. అమిత్ షాపై వ్యాఖ్యలు చేసినందుకే తన ప్రసంగాన్ని నిలిపివేశారని ఆరోపించారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను ప్రస్తావించడం ప్రతిపక్ష నేతగా తన హక్కు అని స్పష్టం చేశారు.

### పెల్లెట్ గన్స్, మేకులతో లాఠీలు వాడారు

విద్యార్థుల గాయాల ఫొటోలను ప్రదర్శించిన రాహుల్, నిరసనలను అణచివేసేందుకు పోలీసులు పెల్లెట్ గన్స్, మేకులు అమర్చిన లాఠీలను ఉపయోగించారని ఆరోపించారు. పెల్లెట్ గన్ కాల్పుల్లో గాయపడిన ఓ విద్యార్థి కంటి చూపు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. యూనిఫాం లేని వ్యక్తులు కూడా విద్యార్థులపై దాడుల్లో పాల్గొన్నారని ప్రశ్నించారు. ఫేస్ రికగ్నిషన్ సాంకేతికతతో విద్యార్థులను గుర్తిస్తున్నారని, వారిని భయపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

### అమిత్ షా బాధ్యత వహించాలి

ఢిల్లీ పోలీసు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ రెండూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోనే పనిచేస్తాయని రాహుల్ గుర్తుచేశారు. పోలీసు బలగాల ప్రతి చర్యకు హోంమంత్రి అనుమతి అవసరమేనని పేర్కొన్నారు. పార్లమెంట్ ప్రాంగణంలో అమిత్ షా పోలీసు అధికారులతో మాట్లాడటం తాను స్వయంగా చూశానని చెప్పారు. విద్యార్థులపై బలప్రయోగానికి అమిత్ షా ఆదేశాలు ఇచ్చి ఉంటే ఆయన బాధ్యుడేనని, తెలియకపోతే సమర్థత లేని హోంమంత్రి అన్న మాటేనని విమర్శించారు. ఈ రెండు పరిస్థితుల్లోనూ ఆయన పదవిలో కొనసాగడానికి అర్హుడు కాదని వ్యాఖ్యానించారు.

### ఇంత వరకు లేఖకు సమాధానం రాలేదు

జూలై 25న అమిత్ షాకు రాసిన లేఖకు ఇప్పటివరకు స్పందన రాలేదని రాహుల్ వెల్లడించారు. విద్యార్థులపై పెలెట్ గన్స్ వినియోగానికి అనుమతి ఇచ్చిందెవరు, సాధారణ దుస్తుల్లో కనిపించిన వ్యక్తులు ఎవరు, వారిని ఎవరు నియమించారనే ప్రశ్నలకు సమాధానం కోరినా కనీసం లేఖ అందిందన్న ధృవీకరణ కూడా రాలేదని అన్నారు. ఈ అంశంలో నిజాలు వెలుగులోకి రావాల్సిందేనని స్పష్టం చేశారు.

### విద్యార్థులకు న్యాయం చేస్తామని హామీ

దాడులకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు ఇప్పటికే తమ వద్ద ఉన్నాయని రాహుల్ చెప్పారు. విద్యార్థులపై దాడి చేసిన అధికారులను గుర్తించామని, బాధ్యులందరికీ చట్టపరమైన శిక్ష తప్పదని హెచ్చరించారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. ఈ ఘటనపై పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆరోపిస్తూ, దేశ ప్రజల ముందుకు వాస్తవాలను తీసుకొస్తామని స్పష్టం చేశారు.

# రాహుల్‌కు రిజిజు సవాల్

- తప్పుదోవపట్టిస్తున్నారన్న మంత్రి



పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లుపై చర్చను కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగా పక్కదారి పట్టిస్తోందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. విద్యార్థుల ప్రయోజనాల కోసం తీసుకొచ్చిన కీలక బిల్లుపై చర్చించాల్సిన సమయంలో ప్రతిపక్షాలు సంబంధం లేని అంశాలను ప్రస్తావిస్తూ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. లోక్‌సభ ఆవరణలో మీడియాతో మాట్లాడిన ఆయన, బిల్లుపై కాంగ్రెస్ నేతలు ఒక్క మాట కూడా మాట్లాడలేదని అన్నారు.

### రాహుల్ గాంధీకి బహిరంగ సవాల్

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బుధవారం సభలో మాట్లాడే సమయంలో ఈ బిల్లుపై కనీసం కొంత సమయం కేటాయించాలని రిజిజు కోరారు. 20 లేదా 30 నిమిషాలు ప్రసంగించినా కనీసం ఐదు నిమిషాలైనా పేపర్ లీక్ బిల్లుపై మాట్లాడాలని సూచించారు. ఇది దేశంలోని లక్షలాది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశమని, అలాంటి కీలక చట్టంపై మౌనం సరైంది కాదని వ్యాఖ్యానించారు.

### విద్యార్థుల డిమాండ్‌తోనే బిల్లు

పరీక్షల పారదర్శకతను కాపాడాలన్న విద్యార్థుల డిమాండ్ మేరకే కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చిందని రిజిజు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయం విద్యార్థుల్లో కొత్త నమ్మకాన్ని కలిగించిందని చెప్పారు. కాంగ్రెస్‌కు పరీక్షల వ్యవస్థపై ఏవైనా సూచనలు ఉంటే స్వాగతిస్తామని, వాటిని సభలో నిర్మాణాత్మకంగా చెప్పాలని సూచించారు. చర్చను రాజకీయ ఆరోపణల వైపు మళ్లించడం వల్ల విద్యార్థులకు ఉపయోగం ఉండదని అన్నారు.

### ప్రియాంక ప్రసంగంపై అభ్యంతరం

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా సహా ప్రతిపక్ష సభ్యులు బిల్లు పరిధికి బయట ఉన్న అంశాలనే ప్రస్తావించారని రిజిజు ఆరోపించారు. అసలు చట్టంలోని నిబంధనలపై చర్చించకుండా ఇతర విషయాలపై విమర్శలు చేయడం సరైన విధానం కాదన్నారు. ప్రజాస్వామ్యంలో అభిప్రాయ భేదాలు సహజమేనని, కానీ చర్చ మర్యాదపూర్వకంగా సాగాలని పేర్కొన్నారు.

### రాహుల్ భాషపై విమర్శలు

రాహుల్ గాంధీ తన రాజకీయ విమర్శల్లో అనుచితమైన పదజాలం ఉపయోగిస్తున్నారని కిరణ్ రిజిజు విమర్శించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో సంయమనంతో కూడిన భాషను ఉపయోగించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని చెప్పారు. విభేదాలు ఉన్నా పరస్పర గౌరవం ఉండాలని, అవమానకర వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు మంచివి కావని వ్యాఖ్యానించారు. పేపర్ లీక్ నిరోధక బిల్లుపై ప్రతిపక్షం సానుకూల సూచనలు చేయాలని, విద్యార్థుల భవిష్యత్తు విషయంలో రాజకీయాలకు తావివ్వొద్దని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు.




# గ్రీన్ కార్డ్‌కు కొత్త దారి!

- అమెరికా సెనేట్‌లో కొత్త బిల్లు
- హెచ్-1బీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్
- ఏడేళ్లున్న భారతీయులకు భారీ ఊరట

అమెరికాలో దీర్ఘకాలంగా నివసిస్తున్న వలసదారులకు శాశ్వత నివాస హోదా కల్పించే లక్ష్యంతో కొత్త బిల్లును అమెరికా సెనేట్‌లో ప్రవేశపెట్టారు. కాలిఫోర్నియాకు చెందిన డెమోక్రటిక్ సెనేటర్ అలెక్స్ పడిల్లా ఈ ప్రతిపాదన తీసుకొచ్చారు. ఈ బిల్లు చట్టంగా మారితే అమెరికాలో కనీసం ఏడేళ్లుగా నిరంతరాయంగా నివసిస్తున్న వలసదారులు గ్రీన్ కార్డ్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం లభిస్తుంది. ముఖ్యంగా హెచ్1బీ వీసాపై పనిచేస్తున్న భారతీయ ఐటీ నిపుణులకు ఇది ఎంతో కీలక పరిణామంగా భావిస్తున్నారు.

### ఎవరికి వర్తిస్తుంది?

రిన్యూయింగ్ ఇమ్మిగ్రేషన్ ప్రొవిజన్స్ ఆఫ్ ది ఇమ్మిగ్రేషన్ యాక్ట్-1929 పేరుతో తీసుకొచ్చిన ఈ బిల్లు ప్రకారం, ఏడేళ్లుగా అమెరికాలో నివసిస్తున్నవారు, ఎలాంటి నేర చరిత్ర లేని వారు, ప్రస్తుతం అమల్లో ఉన్న గ్రీన్ కార్డ్ అర్హత నిబంధనలు పూర్తి చేసినవారు శాశ్వత నివాస హోదాకు దరఖాస్తు చేసుకోవచ్చు. డ్రీమర్స్, టెంపరరీ ప్రొటెక్టెడ్ స్టేటస్ కలిగినవారు, అత్యవసర సేవల ఉద్యోగులు, దీర్ఘకాల వీసా హోల్డర్ల పిల్లలకు కూడా ఈ బిల్లు వర్తించే అవకాశం ఉంది.

### భారతీయులకు ఎందుకు కీలకం?

అమెరికాలో హెచ్1బీ వీసాపై పనిచేస్తున్న వారిలో అత్యధికులు భారతీయులే. ఉద్యోగ ఆధారిత గ్రీన్ కార్డులపై ఉన్న పరిమితుల కారణంగా వేలాది మంది భారతీయులు ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు. కొత్త బిల్లు అమల్లోకి వస్తే ఈ నిరీక్షణ గణనీయంగా తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ, ఇంజినీరింగ్, ఆరోగ్య రంగాల్లో పనిచేస్తున్న నిపుణులకు ఊరట కలిగించే ప్రతిపాదనగా మారింది.

### చట్టం అమల్లోకి రావడం సవాలే

సెనేటర్ అలెక్స్ పడిల్లా ఈ బిల్లు ద్వారా 1986 తర్వాత పెద్దగా మారని వలస చట్టాలను ఆధునిక అవసరాలకు అనుగుణంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు దీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న లక్షలాది మందికి న్యాయం చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్‌లో రిపబ్లికన్ సభ్యులు వలస విధానాలపై మరింత కఠిన వైఖరితో ఉన్నందున ఈ బిల్లు ఆమోదం పొందడం సులభం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయినప్పటికీ సెనేట్ డెమోక్రటిక్ విప్ డిక్ దర్బిన్ సహా పలువురు సెనేటర్లు ఈ బిల్లుకు మద్దతు ప్రకటించారు. ప్రతినిధుల సభలో కూడా దీనికి అనుబంధ బిల్లును ప్రవేశపెట్టడంతో హెచ్1బీ వీసాదారుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

# రాజకీయ దుమారం

- జెన్ జీపై మాటల యుద్ధం
- కంగనాకు సౌరవ్, సోనూ కౌంటర్



ఒక మాట... సోషల్ మీడియాలో పోస్ట్. మరో స్పందన... రాజకీయ దుమారం. ఆ వెంటనే సినీ ప్రముఖుడి ఎంట్రీ. ఇలా జెన్ జీ యువతపై చేసిన ఒక వ్యాఖ్య ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ చేసిన ఘాటు వ్యాఖ్యలు కేవలం రాజకీయ వర్గాలకే పరిమితం కాలేదు. కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ నుంచి గట్టి కౌంటర్ రావడంతో మాటల యుద్ధం మొదలైంది. అదే సమయంలో నటుడు సోనూ సూద్ రంగంలోకి దిగుతూ యువతను గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. ఒకవైపు కంగనా తన అనుభవం, విజయాలను ప్రస్తావిస్తూ విమర్శలకు సమాధానం ఇస్తుంటే, మరోవైపు సౌరవ్ దాస్ ఆమె రాజకీయ అవగాహనను ప్రశ్నించారు. సోనూ సూద్ మాత్రం ప్రజలే నిజమైన బలం అంటూ సంయమన సందేశం ఇచ్చారు. విద్యార్థుల నిరసనలతో మొదలైన ఈ వివాదం ఇప్పుడు రాజకీయాలు, బాలీవుడ్, సోషల్ మీడియా వేదికలపై హోరాహోరీ మాటల సమరంగా మారింది. జెన్ జీ యువత, విద్యార్థుల నిరసనలపై బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయాలు, సినీ రంగంలో తీవ్ర చర్చకు దారితీశాయి. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రధాన ప్రతినిధి సౌరవ్ దాస్‌తో మొదలైన మాటల యుద్ధం, నటుడు సోనూ సూద్ స్పందనతో మరింత వేడెక్కింది. విద్యార్థుల ఆందోళనలపై కంగనా చేసిన విమర్శలు తీవ్ర వివాదానికి దారితీయగా, ఆమె వ్యాఖ్యలకు పలువురు బహిరంగంగానే కౌంటర్ ఇవ్వడం చర్చనీయాంశమైంది.

### సౌరవ్ దాస్‌కు కంగనా ఘాటు సమాధానం

విద్యార్థుల నిరసనలపై తన వ్యాఖ్యలను సౌరవ్ దాస్ తప్పుబట్టడంతో కంగనా సోషల్ మీడియాలో ఘాటుగా స్పందించారు. ముందుగా ఏదైనా నైపుణ్యం నేర్చుకోవాలని సౌరవ్‌కు సూచించారు. వ్యక్తిగత అసంతృప్తులు తప్ప విద్యార్థుల సమస్యలతో ఆయనకు సంబంధం లేదని విమర్శించారు. తన వయసులోనే రెండు జాతీయ పురస్కారాలు అందుకున్నానని, రెండు దశాబ్దాలుగా ప్రజాజీవితంలో కొనసాగుతున్నానని గుర్తు చేశారు. నటి, దర్శకురాలు, నిర్మాత, రచయిత్రి, వ్యాపారవేత్త, ఎంపీగా అనేక బాధ్యతలు నిర్వహిస్తున్నానని పేర్కొన్నారు.

### సౌరవ్ ఎదురుదాడి..

కంగనా వ్యాఖ్యలకు సౌరవ్ దాస్ కూడా అదే స్థాయిలో సమాధానం ఇచ్చారు. ఆమెను సొంత పార్టీ నాయకులే పెద్దగా పట్టించుకోవడం లేదని విమర్శించారు. జెన్ జీ, జెన్ ఆల్ఫా యువత కూడా ఆమె వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవడం లేదన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో ఎంపీగా బాధ్యతలు ఊహించిన దానికంటే క్లిష్టంగా ఉన్నాయని కంగనా గతంలో చెప్పిన వీడియోలను ప్రస్తావిస్తూ, అదే ఆమె రాజకీయ అనుభవాన్ని వెల్లడిస్తోందని వ్యాఖ్యానించారు.

### సోనూ సూద్ హితవు

జెన్ జీ యువతపై కంగనా చేసిన వ్యాఖ్యలపై నటుడు సోనూ సూద్ కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. యువతను గౌరవించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని అన్నారు. యువతే నటులను ప్రజాదరణ శిఖరాలకు తీసుకెళ్తుందని, ప్రజల మద్దతు లేకుండా ఎవరూ నిలబడలేరని చెప్పారు. ప్రజలే దేవుడి స్వరూపమని పేర్కొంటూ, మాటల్లో సంయమనం అవసరమని సూచించారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని స్పష్టం చేశారు.

### సోషల్ మీడియాలో హాట్ టాపిక్

కంగనా, సౌరవ్ దాస్, సోనూ సూద్ వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో తీవ్ర చర్చ కొనసాగుతోంది. కొందరు కంగనా అభిప్రాయాన్ని సమర్థిస్తుండగా, మరికొందరు సోనూ సూద్ చెప్పిన సంయమన సందేశానికి మద్దతు తెలుపుతున్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారి మాటలకు ఎక్కువ బాధ్యత ఉండాలని, యువతను లక్ష్యంగా చేసుకుని చేసే వ్యాఖ్యలు సమాజంపై ప్రభావం చూపుతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థుల నిరసనలతో మొదలైన ఈ వివాదం ఇప్పుడు రాజకీయాలు, బాలీవుడ్, సోషల్ మీడియా వేదికలపై హాట్ టాపిక్‌గా మారింది.

# భారత్ పతకాల జోరు

## మరో ఘన విజయగాథ!



గ్లాస్గోలో జరిగిన 2026 కామన్వెల్త్ క్రీడల్లో భారత్ మరోసారి తన సత్తా చాటింది. ఏడో రోజు పోటీల్లో భారత క్రీడాకారులు పలు విభాగాల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి దేశానికి మరిన్ని పతకాలు ఖాయం చేశారు. ముఖ్యంగా బాక్సింగ్‌లో భారత బాక్సర్లు వరుస విజయాలతో ఆధిపత్యం చాటుతూ పతకాల వేటను మరింత బలోపేతం చేశారు. దీంతో ఈ ఎడిషన్‌లో భారత బాక్సింగ్ జట్టు ఇప్పటికే తొమ్మిది పతకాలు ఖాయం చేసి 2018 గోల్డ్ కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్‌లో నెలకొల్పిన రికార్డును సమం చేసింది. వెయిట్‌లిఫ్టింగ్‌లో సంజన పోరాటం ఆకట్టుకోగా, అథ్లెటిక్స్‌లో మురళీ శ్రీశంకర్, లోకేశ్ సత్యనాథన్ లాంగ్ జంప్‌లో ఫైనల్‌కు చేరి పతకాల ఆశలు రేకెత్తించారు. మహిళల షాట్‌పుట్‌లో మన్‌ప్రీత్ కౌర్ కూడా మెరుగైన ప్రదర్శన కనబరిచింది. పారా స్విమ్మింగ్‌లో చైతన్య విశ్వాస్ కులకర్ణి, సుయశ్ నారాయణ్ జాధవ్ ఫైనల్‌కు అర్హత సాధించగా, పారా అథ్లెటిక్స్‌లో దేవేందర్ కుమార్, సాగర్ థాయత్, మహ్మద్ బాసిల్, దిలీప్ మహదు గావిట్ తమ ఈవెంట్లలో దేశానికి పతకాల అవకాశాలను సజీవంగా ఉంచారు. మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో పారుల్ చౌదరి కూడా ఫైనల్‌లో పోటీపడి ఆకట్టుకుంది. వెయిట్‌లిఫ్టింగ్, బాక్సింగ్, అథ్లెటిక్స్, పారా క్రీడల్లో భారత క్రీడాకారులు వరుస విజయాలు నమోదు చేయడంతో కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ పతకాల సంఖ్య మరింత పెరిగి, ప్రపంచ వేదికపై భారత క్రీడా ప్రతిభ మరోసారి వెలుగొందింది.

# పాక్‌కు షాక్

- విండీస్ టెస్ట్ ఓటమి తర్వాత
- ఇద్దరు బౌలర్లపై ఐసీసీ చర్యలు!

వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో ఓటమి బాధ నుంచి ఇంకా కోలుకోకముందే పాకిస్థాన్ జట్టుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. జట్టు ఫాస్ట్ బౌలర్లు మహ్మద్ అబ్బాస్, ఖుర్రం షాజాద్‌లపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. బ్యాటర్లను ఔట్ చేసిన తర్వాత రెచ్చగొట్టేలా ప్రవర్తించడం ఐసీసీ ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనగా తేలడంతో ఇద్దరినీ లెవల్ 1 నేరానికి బాధ్యులుగా గుర్తించింది. షాయ్ హోప్ వికెట్ తీసిన తర్వాత అతడికి అత్యంత దగ్గరగా వెళ్లి సంబరాలు చేసుకున్న ఖుర్రం షాజాద్‌కు మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ నమోదు చేశారు. మరోవైపు మహ్మద్ అబ్బాస్ కూడా వికెట్ అనంతరం అతిగా సంబరాలు చేసుకోవడంతో అధికారిక హెచ్చరిక జారీ చేసి ఒక డీమెరిట్ పాయింట్ ఇచ్చారు. ఇదిలా ఉండగా తొలి టెస్టులో వెస్టిండీస్ 90 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 211 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్ 120 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ బాబర్ ఆజమ్ ఒంటరి పోరాటం చేస్తూ అజేయంగా 58 పరుగులు చేసినా జట్టును ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయాడు. వరుసగా వికెట్లు కోల్పోవడమే ఓటమికి ప్రధాన కారణమని బాబర్ అంగీకరించాడు. మైదానంలో ప్రవర్తన విషయంలో ఐసీసీ కఠిన వైఖరి మరోసారి స్పష్టమైందని క్రికెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.



# 15 ఏళ్ల వైభవ్‌కు అరుదైన గుర్తింపు

## దులీప్ ట్రోఫీలో వైస్ కెప్టెన్ బాధ్యతలు!



భారత క్రికెట్‌లో సంచలనంగా ఎదుగుతున్న 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి మరో అరుదైన గౌరవం దక్కింది. 2026 దులీప్ ట్రోఫీ కోసం ప్రకటించిన ఈస్ట్ జోన్ జట్టుకు అతడిని వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టగా, వైభవ్‌కు ఉపనాయకత్వం అప్పగించడం అతడిపై సెలెక్టర్ల విశ్వాసాన్ని చాటుతోంది. ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత సీనియర్ జట్టుకు అరంగేట్రం చేసిన వైభవ్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా, జింబాబ్వేతో జరిగిన సిరీస్‌లో వరుసగా రెండు అర్ధ సెంచరీలు బాది తన ప్రతిభను నిరూపించాడు. ఆ సిరీస్‌లో భారత్ మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ జట్టులో మహ్మద్ షమీ, ముఖేశ్ కుమార్, అభిమన్యు ఈశ్వరన్, షాబాజ్ అహ్మద్ వంటి అనుభవజ్ఞులతో కలిసి వైభవ్ ఆడనున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో నిలకడైన ప్రదర్శన కనబరిస్తే భారత టెస్టు జట్టులో స్థానం దక్కించుకునే అవకాశాలు మరింత మెరుగవుతాయని క్రికెట్ నిపుణులు భావిస్తున్నారు. చిన్న వయసులోనే నాయకత్వ బాధ్యతలు అందుకోవడం వైభవ్ కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలిచింది. ఇప్పుడు దులీప్ ట్రోఫీలో అతడి ప్రదర్శనపై భారత క్రికెట్ అభిమానుల దృష్టి నిలిచింది.

# ఐపీఎల్ విలువ రూ.1.79 లక్షల కోట్లు


**అసలు స్వర్ణయుగం ఇప్పుడే మొదలు!**



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రపంచ క్రీడా రంగంలో మరో చరిత్ర సృష్టించింది. 2026 సీజన్ ముగిసే సమయానికి ఐపీఎల్ వ్యాపార విలువ 20.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.79 లక్షల కోట్లు)కు చేరగా, బ్రాండ్ విలువ 4.3 బిలియన్ డాలర్ల (సుమారు రూ.37,400 కోట్లు)కు పెరిగింది. ఈ నేపథ్యంలో పంజాబ్ కింగ్స్ సహ యజమాని నెస్ వాడియా చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఐపీఎల్ అసలు ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైందని, అత్యుత్తమ రోజులు ఇంకా ముందే ఉన్నాయని ఆయన అన్నారు. 2008లో సుమారు 76 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.660 కోట్లు)కు కొనుగోలు చేసిన పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ విలువ ఇప్పుడు 158 మిలియన్ డాలర్ల (సుమారు రూ.1,375 కోట్లు)కు చేరిందని వెల్లడించారు. ఐపీఎల్ కేవలం క్రికెట్ టోర్నమెంట్ మాత్రమే కాదని, భారత క్రీడల ముఖచిత్రాన్నే మార్చేసిందని చెప్పారు. కుటుంబాలు ఐపీఎల్ మ్యాచ్‌ల చుట్టూ తమ సమయాన్ని ప్లాన్ చేసుకుంటున్నాయని, ప్రపంచవ్యాప్తంగా క్రికెట్‌కు కొత్త మార్కెట్లు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. 2026 సీజన్‌ను ప్రపంచవ్యాప్తంగా 1.2 బిలియన్ మంది వీక్షించగా, గుజరాత్ టైటాన్స్-రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫైనల్‌ను 40 కోట్ల మంది వీక్షించి ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ప్రేక్షకులను సాధించిన మ్యాచ్‌గా నిలిచింది. కేవలం పది ఫ్రాంచైజీలే ఉండటం, పెరుగుతున్న ప్రపంచ ఆదరణతో ఐపీఎల్ విలువ రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశముందని నెస్ వాడియా విశ్వాసం వ్యక్తం చేశారు.

# చకచకా స్పిరిట్ షూటింగ్ పూర్తి



**వందరోజుల్లో పూర్తి చేసేలా ప్లాన్**

టాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్‌లో వస్తున్న హై`వోల్టేజ్ యాక్షన్ చిత్రం 'స్పిరిట' గురించి ఓ ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం ఫిలింనగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్యాన్`ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్‌ను కేవలం 100 రోజుల్లోనే పూర్తి చేయాలని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ప్రభాస్ ఇతర ప్రాజెక్టుల షూటింగ్స్‌లో సమాంతరంగా పాల్గొంటున్నప్పటికీ, 'స్పిరిట' టీమ్ మాత్రం తమ ప్లానింగ్ పక్కాగా ఉండటంతో సినిమా అనుకున్న సమయానికే పూర్తవుతుందని పూర్తి విశ్వాసంతో ఉంది. మరోవైపు ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి సుమారు 40 శాతం షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. మిగిలిన మేజర్ షెడ్యూల్స్ ఎక్కువగా హైదరాబాద్‌లోనే జరగనున్నాయి. ఇదిలావుంటే సందీప్ టీమ్ ప్లానింగ్ వలన ప్రభాస్ చేస్తున్న అత్యంత తక్కువ బడ్జెట్ సినిమా ఇదేనని తెలుస్తుంది. గత దశాబ్ద కాలంలో ప్రభాస్ చేసిన భారీ బ్జడెట్ సినిమాలతో పోలిస్తే 'స్పిరిట' అత్యంత తక్కువ బ్జడెట్‌తో రాబోతుందని ఇప్పటికే టాక్ కూడా బయటకు పాకింది. ఇక దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తనదైన మేకింగ్ స్టైల్‌తో ఈ చిత్రాన్ని మరింత పవర్‌ఫుల్‌గా తెరకెక్కిస్తుండటంతో, బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు.

# ఆదర్శకుటుంబం నుంచి సంపూర్ణ పాత్ర పరిచయం



విక్టరీ వెంకటేష్ దగ్గుబాటి, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' నుంచి చిత్రబృందం మరో ఆసక్తికర గ్లింప్స్‌ను విడుదల చేసింది. రోజుకో కొత్త వీడియోతో సినిమా ప్రచారాన్ని వేగవంతం చేస్తున్న మేకర్స్, తాజాగా ఈ చిత్రంలో వెంకటేష్ కూతురిగా, చిట్టిబాబు గారాలపట్టిగా నటిస్తున్న సంపూర్ణ (యువినా పార్థవి) పాత్రను పరిచయం చేశారు. పరిచయమైన ప్రతి ఒక్కరితో ప్రేమలో పడే జెన్‌జీ కూతురి పాత్రలో సంపూర్ణ కనిపించబోతుంది. ఇక త్రివిక్రమ్ మార్క్ సంభాషణలు, వినోదాత్మక ఘట్టాలతో నిండిన ఈ వీడియో సోషల్ మీడియాలో సినీ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో నారా రోహిత్, నివేతా పేతురాజ్, రావు రమేష్, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్. థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 2, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.




# రెండు భాగాలుగా అల్లు,అట్లీల రాకా మూవీ

**వేయికోట్ల బడ్జెట్‌తో ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం**



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్`వరల్డ్ ప్రాజెక్ట్ 'రాకా' సినిమాకు సంబంధించి ఓ సరికొత్త వార్త ఫిలింనగర్ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. అనౌన్స్‌మెంట్‌తోనే భారీ అంచనాలను రేకెత్తించిన ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. మీడియా కథనాల ప్రకారం, 'రాకా' చిత్రాన్ని మేకర్స్ సింగిల్ పార్ట్‌గా కాకుండా రెండు భారీ భాగాలుగా తెరకెక్కించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఈ రెండు భాగాలను కలిపి ఏకంగా రూ.1000 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ రెండు భాగాలలోనూ ఇద్దరు స్టార్ హీరోయిన్లు అలరించనున్నారు. ఒక భాగంలో అల్లు అర్జున్ సరసన బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణ్ నటిస్తుండగా, మరో భాగంలో టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఇక కథాంశం విషయానికొస్తే, అట్లీ ఈ చిత్రాన్ని అత్యంత వైవిధ్యంగా ప్లాన్ చేశారు. ఒక పార్ట్‌ను పూర్తిగా హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్ మరియు ఫాంటసీ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిస్తుండగా, మరో పార్ట్‌ను పూర్తిగా భిన్నమైన ఫ్యూచరిస్టిక్ ప్రపంచంలో నడిచేలా రూపొందిస్తున్నారట. ఇందులో హిస్టారికల్ నేపథ్యంలో వచ్చే భాగంలో దీపికా పదుకొణ్ నటిస్తుందని తెలుస్తోంది. వీటితో పాటు ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ ఒక ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే అట్లీ దర్శకత్వంలో షారుఖ్ నటించిన 'జవాన' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో, ఈ చిత్రంలోనూ ఆయన నటిస్తే సినిమా స్థాయి మరింత పెరుగుతుందని అభిమానులు భావిస్తున్నారు.

# పెళ్లిచూపులు మూవీకి పదేళ్లు

- దర్శకుడిగా తరుణ్ భాస్కర్‌కు హిట్
- నటులుగా విజయ్ దేవరకొండ, రీతూవర్మలకు గుర్తింపు




తెలుగు సినీ పరిశ్రమలో చిన్న సినిమాగా విడుదలై సంచలన విజయాన్ని అందుకున్న 'పెళ్లిచూపులు' విడుదలై జులై 29 పదేళ్లు పూర్తి చేసుకుంది. విజయ్ దేవరకొండ, రీతూ వర్మ జంటగా నటించిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 2016లో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకోవడమే కాకుండా, తెలుగు సినిమా చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. దర్శకుడిగా తరుణ్ భాస్కర్ పరిచయమైన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత డి. సురేశ్ బాబు సమర్పణలో రాజ్ కందుకూరి, యష్ రంగినేని సంయుక్తంగా నిర్మించారు. సహజమైన కథనం, వినోదభరితమైన సంభాషణలు, కొత్త తరహా స్క్రీన్‌ప్లేతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమా, అప్పటి వరకు పెద్దగా గుర్తింపు లేని పలువురు ప్రతిభావంతులకు కొత్త అవకాశాలు తెచ్చిపెట్టింది. 'పెళ్లిచూపులు' విజయ్ దేవరకొండ కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. సోలో హీరోగా ఆయనకు ఇది తొలి పెద్ద విజయం. సినిమాలో విజయ్ నటన, సహజమైన డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమా విజయంతో వరుస అవకాశాలు అందుకున్న విజయ్, ఆ తర్వాత 'అర్జున్ రెడ్డి', 'గీత గోవిందం' వంటి విజయాలతో స్టార్ హీరోగా ఎదిగారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన రీతూ వర్మ తన సహజమైన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలు దక్కించుకుని ప్రముఖ కథానాయికగా గుర్తింపు పొందింది. ఇక దర్శకుడు తరుణ్ భాస్కర్ తొలి సినిమాతోనే తన ప్రత్యేక శైలిని నిరూపించుకున్నారు. 'పెళ్లిచూపులు' తర్వాత టాలీవుడ్‌లో క్రేజీ దర్శకుడిగా ఎదిగిన ఆయన, అనంతరం నటుడిగానూ తనదైన గుర్తింపు సంపాదించారు.బాక్సాఫీస్ దగ్గర మంచి విజయంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న 'పెళ్లిచూపులు' అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులను కూడా సొంతం చేసుకుంది. ఈ చిత్రానికి రెండు జాతీయ చలనచిత్ర అవార్డులు లభించాయి. ఉత్తమ ప్రాంతీయ తెలుగు చిత్రంగా 'పెళ్లిచూపులు' జాతీయ పురస్కారం అందుకోగా, ఉత్తమ మాటల రచయితగా దర్శకుడు తరుణ్ భాస్కర్ నేషనల్ అవార్డు అందుకున్నారు. అలాగే 2016 సంవత్సరానికి గాను ఉత్తమ చిత్రం, ఉత్తమ నటి విభాగాల్లో రెండు నంది అవార్డులు కూడా ప్రకటించబడ్డాయి. ఇందులో రీతూ వర్మ ఉత్తమ నటి అవార్డుకు ఎంపికయ్యారు. అయితే ఆ సమయంలో నంది అవార్డుల ప్రదానోత్సవం జరగలేదు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర సినీ పురస్కారాల్లో కూడా 'పెళ్లిచూపులు'కు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ చిత్రాన్ని సెకండ్ బెస్ట్ మూవీగా ఎంపిక చేసి చిత్రబృందాన్ని సత్కరించింది. దీంతో విడుదలై పదేళ్లు పూర్తయినా 'పెళ్లిచూపులు' ప్రస్థానం ఇంకా కొనసాగుతూనే ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072. Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085